



'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 01.01.2026 | సంపుటి : 2 | సంచిక :326 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thursday | 01.01.2026 | volume : 2 | Issue : 326 | Pages : 8 | Cost : 2/- |




02

## నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి

### సిగాచీ ప్రమాదంపై ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**విచారణ పూర్తి చేసి అభియోగపత్రం దాఖలు చేయాలి**

**పిల్‌లోని విచారణ ట్రయల్ కోర్టుపై ప్రభావం చూపదు**

సిగాచీ దారుణ ఘటనకు అసలైన బాధ్యులెవరో నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాల్సిన బాధ్యత సర్కార్‌దేనని హైకోర్టు స్పష్టం చేసింది. తాము దర్యాప్తును నియంత్రించడం లేదని, విచారణ పూర్తి చేసి అభియోగపత్రం దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ పిల్ విచారణ ట్రయల్ కోర్టుపై ప్రభావం ఉంటుందని తాము భావించడం లేదని అభిప్రాయపడింది. తమ ముందున్న వాస్తవాల ఆధారంగా ట్రయల్‌కోర్టు నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించింది.

# సమృద్ధిగా యూరియా నిల్వలు



### రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు

- రబీకి అవసరమైన 10.40 లక్షల టన్నులు యూరియా
- ఇప్పటికే 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా
- లక్ష టన్నులు అదనంగా యూరియా కొనుగోలు చేసిన రైతులు
- యాప్ అమలు చేస్తున్న జిల్లాలలో ఎటువంటి ఇబ్బందులు లేవు
- యాప్ పై దుష్ప్రచారం చేస్తూ తప్పుదోవ పట్టించే యత్నం
- యూరియా పంపిణీపై వ్యవసాశాఖ మంత్రి తుమ్మల వివరణ

రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ చేపడుతోందని, అన్ని జిల్లాల్లో సమృద్ధిగా నిల్వలు ఉన్నప్పటికీ రైతులలో అనవసర ఆందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.బీ సీజన్‌కు అవసరమైన మొత్తం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో ఇప్పటికే సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు మంత్రి తెలిపారు.

02



## ఎస్ఎస్ఎల్వీ మూడో స్టేజ్ పరీక్ష విజయవంతం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ముందడుగు వేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మూడో దశను విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ కేంద్రంలో మంగళవారం ఈ ప్రయోగం నిర్వహించింది. మూడు-దశల ఆల్-సాలిడ్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ పనితీరును విశ్లేషించడంతోపాటు డేటాను సేకరించినట్లు ఇస్రో వెల్లడించింది.

06

## వేతనం ఆధారంగా హెచ్-1బీ

### లాటరీలో మార్పులివే..

**యూఎస్ :** వృత్తి నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసాల జారీ ప్రక్రియలో కీలక మార్పులు చేపట్టాలని నిర్ణయించిన అమెరికా.. అందుకు సంబంధించిన నిబంధనలను తాజాగా ప్రకటించింది. ఈ మేరకు వీసా కేటాయింపుల విధి విధానాలను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్.. ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించింది. ఈ కొత్త పద్ధతి వచ్చే ఏడాది ఫిబ్రవరి 27

-మిగతా 06 లో..




## లాభాల్లో ముగిసిన సూచీలు

### 2025 సంవత్సరానికి శుభం కార్డు

గత నాలుగు సెషన్లుగా నష్టాలతోనే పయనం సాగించిన దేశీయ సూచీలు బుధవారం మాత్రం లాభాల జోరు అందుకుని 2025 సంవత్సరానికి శుభం పలికాయి. ముఖ్యంగా స్టీల్ స్టాక్స్ భారీ లాభాలను అందుకోవడం సూచీలకు కలిసొచ్చింది. అలాగే క్రూడాయిల్ ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం, కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు మార్కెట్లను ముందుకు నడిపాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ భారీ లాభాలతో రోజును ముగించాయి గత సెషన్ ముగింపు (84, 675)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం 100 పాయిట్లకు పైగా లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజుంతా అదే జోష్‌ను కొనసాగించింది. మధ్యాహ్నం తర్వాత ఆ లాభాలు మరింత పెరిగాయి.

-మిగతా 07 లో..



## పోలవరం-బనకచర్ల పీఎఫ్ఆర్‌కి సూత్రప్రాయ ఆమోదమే

**అది లభించే వరకు డీపీఆర్ తయారీ ప్రక్రియ చేపట్టవద్దంటూ ఏపీపై కేంద్రం ఆంక్షలు విధించింది**

**అయినా ప్రాజెక్టును కేంద్రం ఆమోదించిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు**

**హరీశ్‌రావుపై మంత్రి ఉత్తమ్ ఫైర్**

హైదరాబాద్: పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫీజబిలిటీ రిపోర్టు (పీఎఫ్ఆర్)కు సూత్రప్రాయ ఆమోదం లభించకుండా.. ప్రాజెక్టు డీపీఆర్ తయారీ ప్రక్రియను చేపట్టరాదంటూ కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) డిసెంబర్ 4న రాసిన లేఖలో ఏపీపై ఆంక్షలు విధించిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

-మిగతా 2 లో..



## ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం 713 కోట్లు విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 31 : ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం 713 కోట్ల రూపాయలు విడుదల చేసింది. డిసెంబర్ మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే

-మిగతా 2 లో..




## కాంగ్రెస్ విధానాలతో నేతన్నలకు అన్యాయం

### బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిరిసిల్ల, డిసెంబర్ 31 : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో నేత కార్మికులకు అన్యాయం జరుగుతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. సిరిసిల్ల అపారెల్ పార్క్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అపారెల్ పార్క్‌లో తమ హయాంలో వచ్చిన రెండు పరిశ్రమలు మినహా ఇప్పటివరకు కొత్తగా ఒక్కటీ

-మిగతా 2 లో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 147 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 174 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 252 (కిలో) |
| స్కిన్ లెస్ | 287 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

## హైదరాబాద్ నగరాన్ని అగ్ర స్థానంలో నిలపడమే లక్ష్యం

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్**



హైదరాబాద్, డిసెంబర్31: పరిశుభ్రతలో హైదరాబాద్ మహానగరాన్ని అగ్ర స్థానంలో నిలపడమే లక్ష్యంగా 2026లో పనిచేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీ ఆరో ర్యాంకు సాధించిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2 వేల కిలోమీటర్ల వరకు పరిధి విస్తరించిన

-మిగతా 2 లో..

## డాలర్ల రూపంలో మూవీ ప్రింట్లకు చెల్లింపులు

### కోర్టుకు ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 31 : ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టును పోలీసులు బుధవారం కోర్టుకు సమర్పించారు. అందులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. రెండు రకాలుగా సినిమా ప్రింట్‌ను రవి కొనుగోలు చేశారు. నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ

-మిగతా 2 లో..





03

## ఇంటర్ మ్యాథ్స్‌లో ఇంటర్నల్స్

### వచ్చే ఏడాది నుంచి అమలుకు బోర్డు కసరత్తు

ఇంటర్మీడియెట్ మ్యాథమెటిక్స్ పరీక్షల విధా నం, సిలబస్‌లో ఇంటర్ బోర్డు భారీ మార్పులు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'కొత్త లెక్క'లను అమలు చేయబోతోంది. ఇప్పటి వరకు మ్యాథ్స్ పేపర్ అంటే 75 మార్కులకు రాత పరీక్ష ఉంది. వచ్చే ఏడాది నుంచి ఇది మారనుంది. సీబీఎస్ఈ తరహాలో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని తీసుకురావాలని బోర్డు నిర్ణయించింది. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి థియరీ పరీక్షను 60 మార్కులకు కుదించనున్నారు.

# యూరియా సరఫరాపై నిరంతర పర్యవేక్షణ

**హైదరాబాద్, డిసెంబర్ 31 :** గత సంవత్సరం డిసెంబర్ నెల అమ్మకాలతో పోలిస్తే, ఈ డిసెంబర్‌లో రైతులు లక్ష మెట్రిక్ టన్నుల మేరకు అదనంగా యూరియా కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గత ఏడాది రబీ సీజన్‌లో 79.54 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సంవత్సరం ఇప్పటివరకు 13.89 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఇందులో ప్రధాన పంటలైన వరి 3.94 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తవగా, మొక్కజొన్న 5.45 లక్షల ఎకరాల్లో సాగైనట్లు తెలిపారు. ప్రస్తుతం దుక్కిలో వేసుకునే డి.ఏ.పీ మరియు కాంప్లెక్స్ ఎరువులను రైతులు అధికంగా కొనుగోలు చేస్తున్నారని, మొక్కజొన్న సాగు చేస్తున్న జిల్లాలలో మరియు కొన్నిచోట్ల రైతులు ముందస్తు జాగ్రత్తగా యూరియా బస్తాలు కూడా కొనుగోలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. అయితే ముందుగానే అవసరమైన మేరకు ఎరువులను రాష్ట్రానికి తెప్పించి నిల్వ ఉంచినందున రైతులకు ఎక్కడా కొరత లేకుండా సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, ఇప్పటికే రైతులకు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. సొసైటీకి గానీ, రిటైల్ షాప్‌కు గానీ వచ్చే ప్రతి రైతుకూ యూరియా బస్తాలు అందుతున్నాయని చెప్పారు. మండల అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, సహాయ సంచాలకులు అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా యూరియా సరఫరా చేయాలని



మంత్రి ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న నిల్వల సమాచారాన్ని ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని, అందరూ ఒకే కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడకుండా మండలాల్లో ఉన్న అన్ని రిటైల్ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఃూప్ అమలవుతున్న జిల్లాలలో యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 5 జిల్లాల్లో దాదాపు లక్ష మంది రైతులు యాప్ ద్వారా 3.19 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.




## దర్యాప్తు నిష్పక్షపాతంగా సాగాలి

(మొదటిపేజీ తరువాయి)

అయితే, సర్కార్ నివేదిక, చట్టాలను విశ్లేషించేందుకు సమయం కావాలని అమికస్‌క్యూరీ కోరడంతో ధర్మాసనం విచారణ జనవరి 29కి వాయిదా వేసింది. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో జూన్ 30న సంభవించిన పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందగా, 8 మంది ఆచూకీ ఇంకా లభించాల్సి ఉందని హైదరాబాద్ స్నేహపురి కాలనీకి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్ కలపాల బాబురావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసిన విషయం విదితమే. ఫ్యాక్టరీలో భద్రతా నిబంధనలు లేకపోవడం, బాధిత కార్మికుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోందన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'దర్యాప్తు గణనీయంగా పురోగతి సాధించింది. సిగాచీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో (నిందితుడు2) అమిత్ రాజ్ సిన్హాను అరెస్టు చేశాం. ఇతర నిందితులు (3 నుంచి 7) పరారీలో ఉన్నారు. గల్లంతైన 8 మందిని కూడా మరణించినట్లుగా గుర్తించాం. వారికి కూడా మృతిచెందిన వారిలాగానే పరిహారం అందించే చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు రూ.22.30 కోట్ల పరిహారం పంపిణీ జరిగింది'అని చెప్పారు.

### దర్యాప్తునకు సహకారం అందిస్తున్నాం..

కంపెనీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'దురదృష్టకర సంఘటన జరిగిన వెంటనే అధికారులతో చర్చలు జరిపాం. మరణించిన ప్రతి కార్మికుడి కుటుంబానికి రూ. 42 లక్షలు చెల్లించడానికి అంగీకరించాం. తీవ్రంగా గాయపడిన కార్మికులకు రూ. 2 లక్షలు చెల్లించాం. వారి పూర్తి వైద్య ఖర్చులనూ భరించాం. అరెస్టయిన ఎండీ, పరారీలోని నిందితులకు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయాల్సి వస్తే ట్రయల్ కోర్టుపై ఈ పిల్ ప్రభావం లేకుండా చూడాలి'అని కోరారు. పిటిషనర్ తరఫున న్యాయవాది వసుధా నాగరాజ్ వాదనలు వినిపిస్తూ.. కంపెనీ రూ.కోటి పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి రూ.42 లక్షలు మాత్రమే పంపిణీ చేస్తామని చెప్పడం సరికాదన్నారు.



## కోర్టుకు ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టు

(మొదటిపేజీ తరువాయి)

ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఇక ఐబొమ్మ రవి సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసులు అతడి ద్వారా తెలుసుకున్నారు. అయితే ఈ నగదు లావాదేవీలన్నీ ఐబొమ్మ రవి డాలర్ల రూపంలోనే చేసినట్లు గుర్తించారు. ఇక రాకేష్ అనే వ్యక్తి ద్వారా ట్రైడ్ మార్క్ లైసెన్స్, బెట్టింగ్, పైరసీ ద్వారా వచ్చిన నగదుతో రవి జల్సాలు చేసినట్లు పోలీసులు కనుగొన్నారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోనే రవి ఆఫీస్ నడిపినట్లు కస్టడీ రిపోర్టులో పోలీసులు స్పష్టం చేశారు. దాదాపు 12 రోజుల కస్టడీ అనంతరం మంగళవారం అతడిని జైలుకు పోలీసులు తరలించారు. ఈ కస్టడీలో ఐ బొమ్మ రవి కీలక అంశాలు వెల్లడించారు. వాటిని తమ కస్టడీ రిపోర్టులో పొందుపరిచిన అంశాలను కోర్టుకు పోలీసులు అందజేశారు. ఈ మొత్తంలో దాదాపు రూ. 10 కోట్లు విలాసవంతంగా గడపడానికి ఖర్చు చేశాడు. హై÷ పబ్‌లు, ÷వ్ స్టార్ హోటళ్లలోనే బస చేయడం ద్వారా లగ్జరీ లైఫ్ ఎంజాయి చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడించారు. ప్రస్తుతం రవి అకౌంట్‌లో రూ. 3 కోట్ల నగదును పోలీసులు ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.

## ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

ఆర్థిక శాఖ ద్వారా బుధవారం 713 కోట్ల రూపాయల బిల్లులు విడుదల అయ్యాయి. ఉద్యోగ సంఘాలకు ప్రతినెల 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. జూన్ నెలాఖరులో183 కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఆగస్టు నుంచి ప్రతినెల కనీసం 700 కోట్ల రూపాయల చొప్పున విడుదల చేస్తోంది. విడుదలైన బిల్లుల్లో గ్రాట్యూటీ, జీపీఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్స్‌లు ఉన్నాయి.

## పోలవరం-బనకచర్ల పీఎఫ్‌ఆర్‌కి సూత్రప్రాయ ఆమోదమే లభించలేదు

(మొదటిపేజీ తరువాయి)



తెలిపారు. ఆ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ ఇప్పటివరకు సూత్రప్రాయ ఆమోదమే తెలపలేదని చెప్పారు. అనుమతులు జారీ చేసినట్లు బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎలా ప్రకటించారంటూ తప్పుబట్టారు. నిత్యం అబద్ధాలతో రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే హరీశ్‌రావు మరో శుద్ధ అబద్ధాన్ని ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరహాలో మా ప్రభుత్వం నిష్క్రియాపరత్వంతో వ్యవహరించడం లేదు. మా పోరాటాల ఫలితంగానే బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రం ఆంక్షలు విధించింది. గోదావరి జలాలను అక్రమంగా తరలించుకోవడానికి ఏపీ ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాం. మా ప్రయత్నాల ఫలితంగానే ఈ ప్రాజెక్టుకు తొలిదశ పర్యావరణ అనుమతులను కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖలోని నిపుణుల మదింపు కమిటీ తిరస్కరించింది. ప్రాజెక్టు డీపీఆర్ తయారీకి ఏపీ టెండర్లను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ డిసెంబర్ 17న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ సైతం దాఖలు చేశాం. వాస్తవానికి బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించినట్టు తెలిసిన వెంటనే కేంద్ర జలశక్తి శాఖ, సీడబ్ల్యూసీ, కృష్ణా బోర్డు, గోదావరి బోర్డు, పీపీఏకి వివిధ స్థాయిల్లో ఫిర్యాదులు చేశాం. సీఎం, నేను లేఖలు సైతం రాశాం. సీడబ్ల్యూసీ నిబంధనల ప్రకారమే ప్రాజెక్టు ప్రతిపాదనలను పరిశీలిస్తామంటూ జలశక్తి శాఖ మంత్రి మాకు హామీ ఇచ్చారు..'అని ఉత్తమ్ తెలిపారు. 'గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం వరద జలాలపై పరీవాహక ప్రాంత రాష్ట్రాలన్నింటికీ హక్కులుంటాయని, ఏకపక్షంగా ఏపీ ఆ జలాలను వాడుకోవడం ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధమని ఇప్పటికే కేంద్రానికి పలుమార్లు చెప్పాం. కొత్తగా ఏర్పడిన తెలంగాణ అవసరాలు సంపూరంగా తీర్చడానికి వీలుగా ఇంకా పూర్తి స్థాయిలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టలేదు కాబట్టి, ఏపీ బనకచర్ల ప్రాజెక్టు చేపడితే మా న్యాయమైన హక్కులకు నష్టం కలుగుతుందని తెలియజేశాం. 1,486 టీఎంసీల గోదావరి నికర జలాల్లో తెలంగాణకు 968, ఏపీకి 518 టీఎంసీల వాటాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నాం. గత 11 ఏళ్లలో తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ ఎన్నో అడ్డంకులను సృష్టించడంపై, మిగులు జలాలపై లేని హక్కులను సృష్టించుకోవడానికి అక్రమ ప్రాజెక్టులను ఎడాపెడా చేపట్టడంపై కేంద్రానికి ఆందోళన తెలియజేశాం..'అని మంత్రి వివరించారు.




## కాంగ్రెస్ విధానాలతో నేతన్నలకు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

రాలేదని చెప్పారు. 25 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తాము పార్క్ ఏర్పాటు చేశామని కేటీఆర్ చెప్పారు. సంక్రాంతి లోపు వర్కర్ టూ ఓనర్ పథకం లబ్దిదారులను ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే 10 వేల మందితో నిరసన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. మా ప్రభుత్వం ఉన్నప్పుడు కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, రూ.400 కోట్లతో అపారెల్ పార్క్ ఏర్పాటు చేసిది తామేనని గుర్తుచేశాఃరు. ఈ ప్రభుత్వం ఏమీ చేయలేదని కేటీఆర్ విమర్శించారు.

## కొండాపూర్‌లో రూ.1,000 కోట్లతో నూతన పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్:** మెదక్ జిల్లా కొండాపూర్ ఇండస్ట్రియల్ పార్కులో రూ.1,000 కోట్ల పెట్టుబడితో నిర్మాణాలు పూర్తి చేసుకున్న పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం వెల్లడించారు. సచివాలయంలో మంత్రితో కొండాపూర్ పారిశ్రామికవేత్తల సంఘం ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందరరేగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. "కొండాపూర్ పారిశ్రామికవాడలో మొత్తం 64 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో 36 నిర్మాణాలు పూర్తి చేసుకుని కార్యకలాపాలు మొదలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి ప్రారంభమైతే 5 వేల మందికి తక్షణం ఉద్యోగాలు లభిస్తాయి. మరో నెల రోజుల్లోగా విద్యుత్తు సంబంధిత సమస్యలన్నిటినీ పరిష్కరించాలి. ఇండస్ట్రియల్ పార్కును జాతీయ రహదారితో కలిపే అప్రోచ్ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలి" అని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక,



ప్రభుత్వ పెట్టుబడుల విభాగం డైరెక్టర్ మధుసూదన్, పరిశ్రమల యజమానుల సంఘం అధ్యక్షుడు కె.శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి ఎ.సాంబశివరావు, ట్రెజరర్ సీహెచ్.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.




## హైదరాబాద్ నగరాన్ని అగ్ర స్థానంలో నిలపడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

క్రమంలో 300 వార్డుల నుంచి రోజుకు 9 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోందన్నారు. చెత్త నిర్వహణకు కొత్త డంపింగ్ యార్డుల కోసం భూసేకరణ చేస్తున్నట్లు తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై 300 వార్డుల్లో నిరంతరం ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తామని వివరించారు. గ్రేటర్‌లో పారిశుద్ధ్యం సహా వివిధ అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలపై సమగ్ర వివరాలు వెల్లడించిన ఆర్వీ కర్ణన్.... వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.3వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జీఐఎస్ సర్వే ద్వారా 14 లక్షల ప్రాపర్టీలను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. అందులో లక్ష మంది.. కట్టాల్సిన ఆస్తి పన్ను కంటే తక్కువగా చెల్లిస్తున్నట్టు గుర్తించామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే నగర పౌరులు తమ ఆస్తి పన్ను నేరుగా జీహెచ్ఎంసీ వెబ్ సైట్, యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. నగరంలో రవాణా సదుపాయం మరింత మెరుగుపర్చేందుకు పెండింగ్ లో ఉన్న ఫ్లైఓవర్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని, హెచ్ సీటీ ప్రాజెక్టు కింద చేపట్టిన 32 ప్రాజెక్టులకు త్వరలోనే ప్రారంభిస్తామని ఆర్వీ కర్ణన్ ప్రకటించారు.

## నూతన సంవత్సర వేడుకలలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్‌లో నూతన సంవత్సరం వేడుకలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ దంపతులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పలువురు ఐఏఎస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆస్తుల కోసమే కేసీఆర్ కుటుంబంలో కొట్లాట

- పదేండ్ల కాలంలో పని చేయకుండా అప్పులు చేశారు
- ఏటిసీ సెంటర్లకు మంత్రి వివేక్ శంకుస్థాపన

**యాదాద్రి, డిసెంబర్ 31 :** ఆస్తుల కోసమే బిఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో కొట్లాట జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో ఒక్క పైసా పని చేయకుండా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో నిర్మించతలపెట్టిన నూతన ఏటిసీకి ఆయన ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ సర్కార వ్యవస్థను నాశనం చేసిందని, ఇచ్చిన హామీలను కేసీఆర్ మర్చి పోయారని విమర్శించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్న మంత్రి యువతకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక నైపుణ్యం, శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రూ. 3,622 కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. ఇందిరమ్మ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ఇప్పుడు మళ్లీ కొనసాగిస్తున్నామని అర్హులైన ప్రతి ఒక్కరి కీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. యంగ్ ఇండియా స్కూల్స్ పేదలకు వరంగా మారాయని, ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి గుర్తు చేశారు. రాసున్న రోజుల్లో కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల అవుతాయని యువతకు భరోసా ఇచ్చారు. ఇకపోతే త్వరలో మరిన్నీ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లు ఏర్పాటు చేస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ప్రోత్సాహకం అందిస్తామని చెప్పారు.



తుంగతుర్తి నియోజకవర్గంలోని అడ్డగూడూరులో ఐటీఐకు మంత్రి వివేక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతంలో ఐటీఐ ఏర్పాటు కోసం భూమి పూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఐటీఐలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి కల్పించడం కోసం ఏటీసీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టిస్తోందని.. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని చెప్పారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే మందుల సామెల్ రూ. 3622 కోట్ల నిధులు తెచ్చి తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నాడని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల కోసం ఒక్క పైసా కూడా ఖర్చుచేయకుండా వ్యవస్థని నాశనం చేశారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పదేళ్లు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని విమర్శించారు. అక్రమ ఆస్తుల కోసమే కేసీఆర్ కుటుంబ సభ్యులు కొట్లాడుకుంటున్నారని అన్నారు.

## కాంగ్రెస్ ముక్త భారత్ కోసం కృషి

- మా తదుపరి లక్ష్యం తెలంగాణయే
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, డిసెంబర్ 31 :** బెంగాల్, తమిళనాడు ఎన్నికల తరువాత బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణపైనే దృష్టి సారించబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. ఈసారి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ గెలుపుతో 'కాంగ్రెస్ ముక్త్ భారత్' లక్ష్యాన్ని సంపూర్ణం చేస్తామన్నారు. ఈరోజు కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీజేపీ నాయకులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడారు. బీజేపీ కార్య కర్తల త్యాగాలు, పోరాటాలతో కమ్యూనిస్టు కంచుకోట కేరళ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగించిందని గుర్తు చేశారు. బెంగాల్‌లో బీజేపీ కార్యకర్తల ఇళ్లను ధ్వంసం చేస్తున్నా, మహిళా మోర్చా కార్యకర్తలపై అత్యాచారం చేసినా వెనకంజ వేయకుండా అక్కడి ప్రభుత్వంపై బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బెంగాల్ ప్రభుత్వం వెన్నులో వణుకు పుట్టిస్తున్నారని చెప్పారు. హైకమాండ్ దృష్టి అంతా తెలంగాణపైనే ఉందని.. త్వరలో కేంద్రీకృతం చేయబోతోందని స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు.

## హనీట్రాప్ ఉచ్చు నుంచి తప్పించుకున్న వ్యాపారి

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో హనీ ట్రాప్ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పట్టణంలోని ఓ వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి కొన్ని రోజుల క్రితం ఓ మహిళ ఫోన్ చేసి ప్రేమగా మాట్లాడింది. మాటలు కలిపి పరిచయం పెంచుకుంది. ఆ తర్వాత పట్టణ శివారులో ఓ గదిని అద్దెకు తీసుకొని ఇద్దరూ ఏకాంతంగా గడిపారు. ఆ సమయంలో హనీట్రాప్ ముఠా సభ్యులు వీడియోలు, ఫోటోలు తీశారు. మరుసటి రోజు సదరు వ్యాపారికి వీడియో, ఫొటోలు వాట్సప్ చేసి.. రూ. పదిలక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ఫొటోలు వైరల్ చేస్తామని బెదిరించారు. ఆ ముఠాకు భయపడకుండా.. వ్యాపారి ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి రంగంలోకి దిగిన పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి ఆరుగురిపై కేసు నమోదు చేశారు. మహిళతో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ ముఠాకు చెందిన మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ నమ్మి మోసపోవద్దని సీఐ అనిల్ కుమార్ ప్రజలకు సూచించారు. ఎవరైనా ఇలాంటి వేధింపులకు గురి చేస్తే భయపడకుండా నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు.

## పురాతన వస్తువుల విభజన కోసం కొత్త కమిటీ

### విభజన చట్టం ప్రకారం వస్తువుల పంపిణీ

**హైదరాబాద్, డిసెంబర్ 31 :** ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య పురాతన వస్తువుల విభజన కోసం కొత్త కమిటీ ఏర్పాటు అయింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మ్యూజియంలో ఉంచిన పురాతన వస్తువుల విభజన కోసం ఈ కమిటీ ఏర్పాటు చేయబడింది. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టం -2014 నిబంధనల ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య వస్తువుల పంపకం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 8 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ ఛైర్ పర్సన్‌గా రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఛైర్ పర్సన్ తేజస్వీ పొడపాటి నియామకం జరిగింది. కన్వీనర్‌గా పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం నియమించింది. కమిటీలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చరిత్ర విభాగ విశ్రాంత హెచ్ వోడీ ప్రొఫెసర్ వకులా భరణం రామకృష్ణతో పాటు పురావస్తు శాఖ, మ్యూజియంలో ఉన్నత హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన పలువురు అధికారులు ఉన్నారు. పురాతన వస్తువుల విభజన కోసం తెలంగాణ రాష్ట్ర కమిటీలతో కొత్తగా ఏర్పాటైన కమిటీ సమావేశం కానుంది. రాష్ట్రానికి చెందిన పురాతన వస్తువులను గుర్తించి, ఎంపిక, పర్యవేక్షణ, పంపిణీకి ఈ కమిటీ చర్యలు తీసుకోనుంది. పురాతన వస్తువులను రాష్ట్రానికి బదిలీ చేయడం సహా మ్యూజియంలో భద్రపరిచే చర్యలు తీసుకోనుంది. ఇందుకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని పురావస్తు , మ్యూజియంల కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### మానకొండూరులో కవిత నిరసన ప్రదర్శన



**కరీంనగర్, డిసెంబర్ 31 :** తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు, పింఛను, 250 గజాల స్థలం ఇస్తామని హామీలు ఇచ్చి నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలో ఆమె నిరసన ప్రదర్శన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారులకు నివాస స్థలాలు ఇచ్చేవరకు తమ పోరాటం ఆగదని కవిత తెలిపారు. పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత మరింత దూకుడు పెంచారు. ప్రజల్లో తిరగాలని, వారి సమస్యలు తెలుసుకోవాలని నిర్ణయించారు. అందుకే 'జనం బాట' పేరుతో పర్యటన ప్రారంభించి పలు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామాలు, పట్టణాలు అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో తిరుగుతూ రైతులు, మహిళలు, యువతతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు కవితపై బీఆర్ఎస్ పార్టీ నేతల విమర్శలు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. అంతేకాకుండా కవిత కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్నారంటూ ప్రచారం కూడా జరిగింది. అయితే దీనిపై కవిత స్పష్టమైన ప్రకటన చేయలేదు. మొత్తానికి 2025 సంవత్సరంలో బీఆర్ఎస్‌కు కవిత పెద్ద షాక్ ఇచ్చిందనే చెప్పుకోవచ్చు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**వరంగల్, డిసెంబర్ 31 :** గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారు జామున వరంగల్-చింతలపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య జరిగింది. వరంగల్ జీఆర్పీ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం. సుమారు (45) ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి అబ్బని కుంట మైసమ్మ దేవాలయం సమీపంలో గుర్తుతెలియని రైలు ఢీ కొట్టింది. మృతుడు బ్లాక్ అండ్ వైట్ షేడ్స్ జీన్స్ ప్యాంట్, వైట్ కలర్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి గుర్తింపు ఆధారాలు లభించలేదు. రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ మార్చురీ గదిలో భద్రపరిచి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఎంజీఎం దవాఖానా మార్చురీలో గాని లేదా వరంగల్ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.

## జనగామలో రోడ్డు ప్రమాదం

**జనగామ, డిసెంబర్ 31 :** జనగామ- సూర్యాపేట జాతీయ రహదారిపై లింగాల గణపురం మండలం వడిచర్ల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని విజయవాడకు చెందిన సయ్యపురాజు, రాంప్రసాద్, లవ కుమార్, శరత్ కుమార్ రామగుండంలో జరిగిన ఈవెంట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వడిచెర్ల సమీపంలో జనగామ వైపు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపారు. ఈ క్రమంలో నిద్రమత్తులో ఉన్న కారు డ్రైవర్ డీసీఎంను గమనించకుండా ఎదురుగా వెళ్లి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కారులో ఉన్న విజయవాడ చెందిన సయ్యపురాజు విష్ణువర్ధన్ అలియాస్ బబ్లు(32) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా జనగామ హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని జనగామ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సిందూర్‌తో దెబ్బతీసినా వెనక్కి తగ్గం: లష్కరే నేత

**లాహోర్, డిసెంబర్ 31 :** పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులు, పాక్ సైన్యంపై విరుచుకుపడింది. పీఓకే, పాకిస్తాన్‌లోని ఇతర భాగాల్లోని లష్కరే తోయిబా, జైషే మహ్మద్ ఉగ్రవాద స్థావరాలు, వాటి ప్రధాన కార్యాలయాలపై వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో వందలాది మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే, భారత్ తమ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేసిందని లష్కరేతోయిబా(ఎల్ఇటి) అగ్ర నాయకుడు అంగీకరించాడు. అయినప్పటికీ, భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని బెదిరింపులకు పాల్పడ్డాడు. లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్ సహాయకుడు, ఆ సంస్థ డిప్యూటీ చీఫ్, పహల్గామ్ దాడి సూత్రధారి అయిన సైఫుల్లా కసూరి భారత దాడులను ఒప్పుకున్నారు. పాక్‌లో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో కసూరీ ఈ వ్యాఖ్యలు చేశాడు. విద్వేషపూరిత ప్రసంగంలో.. 'మేము మా కాశ్మీర్ మిషన్ నుంచి ఎప్పటికీ వెనక్కి తగ్గము' అంటూ వ్యాఖ్యలు చేశారు. కాశ్మీర్, అమృత్సర్, హోషియార్‌పూర్, గురుదాస్‌పూర్, జునాగఢ్, మునావదర్‌లోని కొన్ని ప్రాంతాలు, హైదరాబాద్ దక్కన్, బెంగాల్ వంటి పాకిస్తాన్ ప్రాంతాలను తీసుకున్నారని అన్నాడు.

## ఇంటర్ మ్యాథ్స్‌లో ఇంటర్నల్స్

### వచ్చే ఏడాది నుంచి అమలుకు బోర్డు కసరత్తు

**హైదరాబాద్, డిసెంబర్ 31 :** ఇంటర్మీడియెట్ మ్యాథమెటిక్స్ పరీక్షల విధానం, సిలబస్‌లో ఇంటర్ బోర్డు భారీ మార్పులు చేస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'కొత్త లెక్క'లను అమలు చేయబోతోంది. ఇప్పటి వరకు మ్యాథ్స్ పేపర్ అంటే 75 మార్కులకు రాత పరీక్ష ఉంది. వచ్చే ఏడాది నుంచి ఇది మారనుంది. సీబీఎస్ఈ తరహాలో ఇంటర్నల్ మార్కుల విధానాన్ని తీసుకురావాలని బోర్డు నిర్ణయించింది. వచ్చే అకాడమిక్ ఇయర్ నుంచి థియరీ పరీక్షను 60 మార్కులకు కుదించనున్నారు. మిగిలిన 15 మార్కులను 'ఇంటర్నల్స్' కు కేటాయించనున్నారు. అంటే కాలేజీల చేతిలో ఈ 15 మార్కులు ఉండనున్నాయి. విద్యార్థి సామర్థ్యం, ప్రాజెక్టులు, అటెండెన్స్ వంటి అంశాల ఆధారంగా ఇంటర్నల్స్?లో మార్కులు వేస్తారు. దీంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంత తగ్గే అవకాశం ఉంది. ఇప్పటివరకూ ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ఒకేలా ఉంది. రెండు పేపర్లకు వచ్చే 150 మార్కులను శాతంగా తీసుకొని వంద మార్కులకు కుదించారు. ఇకపై ఈ విధానానికి చెక్ పడనున్నది. ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ ను వంద మార్కులకు నిర్వహించనున్నారు. ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు వేర్వేరుగా ప్రశ్నపత్రాలు రూపొందించనున్నారు. కామర్స్ బ్యాక్ గ్రౌండ్ ఉండే ఎంఈసీ వాళ్లకు వారి సబ్జెక్టులకు ఉపయోగపడేలా మ్యాథ్స్ సిలబస్ ను రూపొందించనున్నారు. అలాగే, పరీక్షల విధానంతో పాటు సిలబస్ లోనూ మార్పులు జరగనున్నాయి. ప్రస్తుతం మ్యాథ్స్ బీలోనే ఎక్కువ మంది ఫెయిల్ అవుతున్నారు. దీన్ని గమనించిన ఇంటర్ బోర్డు.. మ్యాథ్స్ బీ పాఠ్య పుస్తకంలోని కొన్ని కఠినమైన చాప్టర్లను మ్యాథ్స్ ఏలోకి మార్చాలని డిసైడ్ అయింది. ఈ మార్పులన్నీ వచ్చే విద్యా సంవత్సరం నుంచే పక్కాగా అమలు కానున్నాయి.




## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సజీవదహనం

### ఆరుగురు మహిళలకు జీవితఖైదు

**జగిత్యాల, డిసెంబర్ 31 :** ఓ సాఫ్ట్‌వేర్ సజీవదహనం కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆరుగురు మహిళలకు జీవిత ఖైదుతో పాటు పదివేల చొప్పున జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌లోని అల్వాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు రాచర్ల పవన్‌కుమార్(38) సజీవదహనం కేసులో జగిత్యాల జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. మృతుడి భార్యతో పాటు మరో ఐదుగురు మహిళలకు జీవితఖైదు విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. జగిత్యాలకు చెందిన విజయ్.. కొండగట్టుకు దాదాపు 1.5 కిలోమీటర్ల దూరంలో మంజునాథ ఆలయాన్ని, దాని పక్కనే కుటీరాన్ని నిర్మించుకున్నారు. విజయ్ తమ్ముడు జగన్ అనారోగ్యంతో మృతి చెందారు. విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బావ పవన్‌కుమార్, భార్య కృష్ణవేణితో కలిసి 2020 అక్టోబరు 28న రాత్రి మంజునాథ ఆలయానికి చేరుకున్నారు. పవన్‌కుమార్ చేతబడి చేయించి తన భర్తను చంపించాడనే అనుమానంతో అక్కడే ఉన్న జగన్ భార్య సుమలత బంధువులతో కలిసి అతన్ని కుటీరంలోని ఓ గదిలో బంధించింది. అందరూ కలిసి.. పవన్ ఒంటిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. పోలీసులు వచ్చి గది తాళం తీసే సరికే పవన్‌కుమార్ పూర్తిగా దహనమయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. పవన్ కుమార్ భార్య కృష్ణవేణితో పాటు మరో ఐదుగురి మహిళలను నిందితులుగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జగిత్యాల మొదటి అదనపు న్యాయమూర్తి ఎస్. నారాయణ ఆరుగురు మహిళలకు జీవిత ఖైదు, రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.



## లడ్డూప్రాదాల విక్రయంలో రికార్డు

**తిరుమల, డిసెంబర్ 31 :** తిరుమలలో ఈ ఏడాది శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు చరిత్రలో నిలిచిపోయే రికార్డును సృష్టించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2025వ సంవత్సరంలో మొత్తం 13 కోట్ల 52 లక్షల లడ్డూలు విక్రయించి సరికొత్త మైలురాయిని అందుకున్నట్లు టిటిడి తెలిపింది. గత ఏడాది 12 కోట్ల 15 లక్షలు మాత్రమే ఉండగా, ఈ ఏడాది 13 కోట్లు దాటింది. గతేడాది కంటే ఈ ఏడాది సుమారు కోటి 37 లక్షల లడ్డూల విక్రయాలు అదనంగా విక్రయించడం జరిగినట్లు టిటిడి తెలిపింది. కాగా డిసెంబర్ 28వ 2025న ఒక్కరోజే అత్యధికంగా 5 లక్షల 12 వేల లడ్డూలు విక్రయించినట్టు టిటిడి వెల్లడించింది. ఇది ఇప్పటివరకు నమోదైన అత్యధిక సింగిల్ డే లడ్డూ విక్రయాలుగా నిలిచింది.

## యూరియా కష్టాలపై పట్టింపులేని ప్రభుత్వం


### మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శలు

**నల్లగొండ, డిసెంబర్ 31 :** రైతులకు ఎరువులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ విమర్శలు గుప్పించారు. యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతమని అన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం మండలంలో పార్టీ స్థానిక నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. పొంకనాల రేవంత్‌రెడ్డి యాప్ పేరుతో రైతులను ఇబ్బందులు పెడుతున్నడని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ యాప్ వాడటం తెల్వక రైతులు ఇబ్బందులు పడుతున్నరని చెప్పారు. యాప్‌లో ఎకరాకు మూడు బస్తాల యూరియాకు బదులు ఒక బస్తా మాత్రమే ఫీడ్ చేసుకునేలా సెట్ చేశారని ఆరోపించారు. పోనీ ఒక బస్తా అయినా తీసుకుందామని, యాప్‌లో ఫీడ్ చేయించుకుని ఎరువుల దుకాణానికి వెళ్తే.. అక్కడ స్టాక్ లేదని చెబుతున్నారని విమర్శించారు. యాప్‌లో స్టాక్ చూపిస్తున్నదని, స్టోర్‌కు మాత్రం యూరియా రాలేదని ఎరువుల దుకాణదార్లు వాపిస్తున్నారని భగత్ చెప్పారు. ఈ చేతగాని రేవంత్‌రెడ్డి ప్రభుత్వంవల్లే రైతులకు ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా రేవంత్ సర్కారు యాప్‌లను తీసేసి రైతులకు మునుపటిలాగే నేరుగా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కాశ్మీర్‌లో మంచు దుప్పటి

**శ్రీనగర్, డిసెంబర్ 31 :** జమ్ముకశ్మీర్ లోని కశ్మీర్ లోయ లో మంచు దుప్పటి పరుచుకుంది. కశ్మీర్ వ్యాలీలోని ప్రసిద్ధ టూరిస్ట్ స్పాట్ అయిన సోనామార్గ్‌లో తెల్లటి దూది వెదజల్లినట్టుగా మంచు పరుచుకున్నది. దాంతో కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ అందంగా, ఆహ్లాదకరంగా, అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఆ సుందర దృశ్యాలను టూరిస్టులకు కనువిందు చేస్తున్నాయి. కశ్మీర్ వ్యాలీలో పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడంతో గత కొన్ని రోజుల నుంచి మంచు విపరీతంగా కురుస్తున్నది. సన్నని దూది పింజాల్లా రాలుతున్న మంచును యాత్రికులు తెగ ఎంజాయ్ చేస్తున్నారు. కశ్మీర్ వ్యాలీ పరిసరాలన్నీ తెల్లని మంచు పరుచుకోవడంతో అక్కడి వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఆ మంచు దృశ్యాలను సోషల్ మీడియాలో పలువురు పర్యాటకులు పంచుకున్నారు.

# ఆందోళనకరంగా డ్రగ్స్, ఆన్‌లైన్ మోసాలు!



**మాదకద్రవ్యాలు, గంజాయి, డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలు ఇప్పుడు సమాజాన్ని ఆందోళన కలిగిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మాదకద్రవ్యాలకు తోడు, ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా చూసాం. గతేడాది విపరీతంగా దాడులు చేసి మదకద్రవ్యాలను, గంజాయిని పట్టుకున్నా చీమల పుట్టల్లా దుండగులు పుట్టుకుని వస్తున్నారు. కొత్త సంవత్సరం ముందు మాదకద్రవ్యాల పట్టివేత జరుగుతున్నా ఇంకా ఆగడం లేదు. పోలీస్ శాఖ గతంలో ఎప్పుడూ లేనంతగా ప్రత్యే దష్టితో కృషి చేస్తోంది. ఆన్‌లైన్ మోసాలపై తరచూ హెచ్చరికలు చేసి, ప్రకటనలు గుప్పిస్తున్నా..మోసాలు ఆగడం లేదు. ప్రజలు ఏమరుపాటు కారణంగా మోసాలు సాగుతున్నాయి. ప్రస్తు డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, అంతే వేగంతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లే లక్ష్యంగా, విదేశీ గడ్డపై నుంచి భారతీయుల ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. గత రెండేళ్లలోనే బాధితులు వేల కోట్లను కోల్పోయారు. ఒకవైపు వేల సంఖ్యలో కేసులు నమోదవుతుంటే, మరోవైపు రికవరీ మాత్రం నామమాత్రంగానే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పోలీసులు ఆధునిక సాఫ్ట్‌వేర్ టూల్స్‌తో దర్యాప్తును వేగవంతం చేస్తున్నప్పటికీ, నేరగాళ్ల నెట్‌వర్క్ అంతర్జాతీయ స్థాయికి విస్తరించడం సవాలుగా మారింది.**

సైబర్ కేసులు నమోదనేది కేవలం సాంకేతికంగా ఓ సంఖ్యగా కనబడుతున్నప్పటికీ.. పోగొట్టుకున్న నగదును తిరిగి తీసుకొచ్చి వారికి అందించడం పోలీస్‌శాఖకు ఓ సవాలుగా మారింది. పోలీస్‌శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని చెబుతున్నప్పటికీ వైట్ కాలర్ నేరాల్లో రికవరీలను గమనిస్తే పేలవంగా కనబడుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. దీనికి మోసగాళ్లే అత్యాధుని టెక్నాలజీ వాడుతున్నారని గుర్తించాలి. సైబర్, డిజిటల్ నేరాలకు పాల్పడే వారు ఇతర దేశాల్లో ఉంటూ ఆపరేట్ చేయడంతోపాటు నగదు బదిలీ అయిన నిమిషాల్లోనే ఆ నగదు విదేశాలకు బదిలీ చేయడం, క్రిప్టో కరెన్సీగా నేరస్తుల వెనుక ముఠాలు పనిచేస్తుండటంతో రికవరీ కష్టంగా మారిందని పోలీస్ ఉన్నతాధికారులే పేర్కొంటున్నారు. ఎపిలో సైబర్ కేసులు 2024లో 66,507 నమోదు కాగా, ఈ ఏడాది (2025) ఇప్పటి వరకు 62,414 నమోదయ్యాయి. ఇందులో గతేడాది 2,877 కేసులు, ఈ ఏడాది 2,332 కేసులు ఎఫ్ఐఆర్ అయినట్లు పోలీస్ రికార్డులు వెల్లడిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం.. రెండేళ్లలో ప్రజలు నష్టపోయింది రూ.1,789 కోట్లు కాగా, ఇందులో గతేడాది రూ.974 కోట్లు, ఈ ఏడాది రూ.815 కోట్లుగా ఉంది. ఇందుకు సంబంధించి గతేడాది రూ.123 కోట్లు, ఈ ఏడాది రూ.98 కోట్లను బ్యాంకుల్లో విత్ హోల్డ్‌లో పోలీస్‌శాఖ పెట్టించగలిగింది. ఇక నష్టపోయిన నగదులో గతేడాది రూ.4.7 కోట్లు, ఈ ఏడాది కేవలం రూ.3 కోట్లను రాబట్టగలిగింది.

ఇక ఆర్థిక నేరాలకు సంబంధించి గతేడాది 7,667 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 8,034 కేసులు నమోద్లై 4.78 శాతం వృద్ధి రేటు కనబడుతోంది. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లను లక్ష్యంగా చేసుకుని, మభ్యపెట్టి డిజిటల్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇందులో అత్యధికంగా చీటింగ్, నేరపూరిత సంఘటనలు, నమ్మకద్రోహాలు వంటి ఘటనలు వల్ల కేసులు పెరుగుతున్నట్లు పోలీస్‌శాఖ పేర్కొంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా నేరాల నియంత్రణకు డ్రోన్లు, సిసి టివిలు, ఎఐ హాక్‌థాన్, ఎఐ టూల్స్‌ను కూడా ఉపయోగిస్తున్నామని వార్షిక నివేదికలో పోలీస్‌శాఖ వెల్లడించింది. ఇకపోతే తెలంగాణ, ఆంధ్రాల్లో మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా దొరుకుతుండడం, వీటికి మత్తుకు యువత బానిసలవుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు అనే తేడా లేకుండా ఎక్కడ పడితే డ్రగ్స్, గంజాయి పట్టుబడుతున్నాయి. ఈ ఏడాది 30శాతానికి పెరిగిన ఎన్డీపీఎస్ అంటే నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్స్ కేసుల సంఖ్య తెలంగాణలో 'మత్తు' మూలాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియజేస్తున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈగల్ ఫోర్స్ డ్రగ్స్ రహిత తెలంగాణెళి లక్ష్యంగా దాడులు విపరీతంగా చేస్తోంది. అయితే దాడులు విపరీతంగా ఉన్నా గతంతో పోల్చితే 39శాతం యువత డ్రగ్స్‌కు బానిసలు కావడం దురదృష్టకరం. 2023లో రూ.94.39 కోట్లు, 2024లో రూ.139.69 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుంటే ఈ ఏడాదిలో రికార్డు స్థాయిలో రూ.172.93 కోట్ల విలువైన సింథటిక్ డ్రగ్స్, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ శివధర్‌రెడ్డి ప్రకటించిన వార్షిక నివేదికలో చెప్పారు.

ఈ ఏడాది ఎన్డీపీఎస్ కేసుల్లో 81మందికి శిక్ష పడినట్టు తెలిపారు. సుమారు రూ.41.47 కోట్ల విలువైన ఆస్తులను డ్రగ్స్ పెడ్లర్ల నుంచి జప్తు చేసినట్టు తెలిపారు. రాష్ట్రంలో విస్తరిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎక్కడిక్కడ ప్రచారం ముమ్మరం చేశారు. ఈ ఏడాది 571కార్యక్రమాలు చేపట్టామని, 47,881మంది యాంటీ డ్రగ్ సోల్జర్స్‌ను ఎన్‌రోల్ చేశామని డిజిపి పేర్కొన్నారు. కల్తీ కల్లు కేసుల్లో రూ.42 కోట్ల విలువైన ఆల్ప్రజోలం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు 2,337 కేసుల్లో 26,988 కిలోల డ్రగ్స్‌ను నిర్వీర్యం చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే ప్రజలు అప్రమత్తంగా లేకపోవడం మరో ఎత్తు. తమ పిల్లలు ఎక్కడ డ్రగ్స్ బారిన పడుతున్నారో తల్లిదండ్రులు గుర్తించడం లేదు. అలాగే పలుమార్లు పలురకాలుగా హెచ్చరికలు చేస్తున్నా ఆన్‌లైన్ మోసాల బారిన పడుతూనే ఉన్నారు. ఈ విషయాల్లో ప్రజలు ముందుగా చైతన్యం కావాలి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కాకుండా అప్రమత్తంగా ఉండాలి.

# జాతి అహంకారం సమాజానికి పట్టిన అంటువ్యాధి

## ఎంజెల్ చక్మ కిరాతక హత్యపై కేటీఆర్ ఆవేదన

**హైదరాబాద్, డిసెంబర్ 31 :** ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో త్రిపురకు చెందిన ఎంబీఏ విద్యార్థి ఎంజెల్ చక్మ కిరాతక హత్యపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన దేశంలో పెరుగుతున్న విద్వేషానికి, జాత్యహంకారానికి పరాకాష్ట అని ఆయన సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. జాత్యహంకారం అనేది నాగరిక సమాజానికి పట్టిన అంటువ్యాధి అంటూ కేటీఆర్ స్పష్టం చేశారు. త్రిపురకు చెందిన ఎంజెల్ చక్మ మరియు అతని సోదరుడు మైఖేల్ డెహ్రాడూన్‌లో ఉన్న సమయంలో, కొందరు దుండగులు వారి రూపంపై జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తూ అవమానించారు. దీనిపై ప్రతిఘటించినందుకు గాను వారిపై కత్తులు, రాడ్లతో కిరాతకంగా దాడి చేశారు. 'మేము భారతీయులమే.. మా జాతీయతను నిరూపించుకోవడానికి ఇంకేం సర్టిఫికేట్లు చూపాలి?' అని ఎంజెల్ ప్రశ్నించడం ఆ అమానుష దాడికి ముందు అతను చేసిన ఆఖరి నిరసన. ఈ దాడి అనంతరం ఎంజెల్ తీవ్ర గాయాలతో దాదాపు 16 రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు ఆసుపత్రిలో కన్నుమూశాడు. అయితే ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వైవిధ్యంలో ఏకత్వం కలిగిన



భారతదేశం ఇలాంటి ఎంపిక చేసిన విద్వేషాలను భరించలేదని, ఇటువంటి విష సంస్కృతి దేశ మనుగడకే ప్రమాదమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జాత్యహంకారం ఏ రూపంలో ఉన్నా దానిపై కఠిన విధానాలు పాటించాలని, బాధితుడికి న్యాయం జరగడం విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని ఆయన డిమాండ్ చేశారు. కేవలం ఖండనలతో సరిపెట్టకుండా, జాత్య హంకార వ్యాఖ్యలు మరియు హింసకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం స్పష్టమైన, కఠినమైన చట్టాలను తీసుకు రావాలని కేటీఆర్ కోరారు. ఇలాంటి ఘటనలు విడిగా జరిగేవి కావని, సమాజంలో ద్వేషం సాధారణీకరించబడుతుందనడానికి ఇది ఒక హెచ్చరిక అని కేటీఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఒక బీఎస్ఎఫ్ జవాను కుమారుడైన ఎంజెల్ చక్మ ఇలా జాత్యహంకా రానికి బలికావడంపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేటీఆర్‌తో పాటు పలువురు జాతీయ నేతలు ఈ ఘటనను ఖండించారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది.

# నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

**హైదరాబాద్, డిసెంబర్ 31 :** నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో నగరంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఫ్లై ఓవర్లు మూసేసారు. ఎక్కడిక్కడ తనిఖీలు మొదలు పెట్టారు. సాయంత్రం నుంచే పోలీసులు వాహనాలను చెక్ చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో నగర వాసులకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారి పట్ల ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా పోలీసులు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేశాడు. రాత్రి నగరం అంతటా 120కి పైగా కీలక పాయింట్లలో ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబోతున్నట్లు తెలిపాడు. ఈ తనిఖీలు కేవలం ఈ రోజుకే పరిమితం కాకుండా జనవరి మొదటి వారం అంతా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానా విధించడంతో పాటు, వాహనాన్ని సీజ్ చేస్తామని, అలాగే కోర్టు ద్వారా జైలు శిక్ష మరియు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే ప్రక్రియను చేపడతామని హెచ్చరించారు. కేవలం డ్రంక్ అండ్ డ్రైవ్ మాత్రమే కాకుండా అతివేగంగా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, బహిరంగ ప్రదేశాల్లో నలుగురికి ఇబ్బంది కలిగించేలా న్యూసెన్స్ చేయడం వంటి పనులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు తెలిపారు. మద్యం సేవించిన వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి, స్వయంగా డ్రైవింగ్ చేయకుండా క్యాబ్ సేవలను లేదా డ్రైవర్లను ఆశ్రయించాలని సూచించారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి క్షేమంగా, సంతోషంగా జరుపుకోవాలని పోలీస్ యంత్రాంగం కోరింది.

# హిందూ జంటలు కనీసం ఇద్దరిని కనాలి

## అసోం సిఎం హిమంత్ బిశ్వ శర్మ పిలుపు

**గౌహతి, డిసెంబర్ 31 :** జనాభా పెరుగుదలకు యువత ఆలోచన చేయాలని అస్సాం ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత హిమాంత బిశ్వశర్మ సంతానం మరోసారి కామెంట్స్ చేశారు. అస్సాంలోని హిందూ జంటలు ఒక్క సంతానంతో ఆపవద్దని, కనీసం ఇద్దరినైనా కనాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో హిందువుల జననాల రేటు ఆందోళనకర రీతిలో తగ్గిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీ డామినేట్ ఏరియాలతో పోల్చి చూస్తే ఇతర ప్రాంతాల్లో జననాల రేటు తక్కువగా ఉన్నదని అన్నారు. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన.. మైనారిటీ డామినేటెడ్ ఏరియాల్లో జననాల నిష్పత్తి ఎక్కువగా ఉన్నదని అస్సాం సీఎం చెప్పారు. అదే సమయంలో హిందువుల్లో జననాల రేటు వేగంగా తగ్గిపోతోందని అన్నారు. అందుకే పిల్లలను కనడం ఒక్కరితో ఆపవద్దని హిందూ జంటలను కోరారు. కనీసం ఇద్దరినీ కనాలని, వీలైతే ముగ్గురిని కన్నా మంచిదేనని ఆయన వ్యాఖ్యానించారు. అదే సమయంలో మైనారిటీలు ఏడు, ఎనిమిది మంది పిల్లలను కనడం ఆపేయాలని సూచించారు.

# అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మ జాతర

## అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే

**హన్మకొండ, డిసెంబర్ 31 :** మినీ మేడారంగా పేరొందిన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మ జాతరను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం అగ్రంపహాడ్‌లో సమ్మక్క-సారలమ్మను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వహించవద్దని, రహదారికి ఇరువైపులా విద్యుత్తు దీపాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అసలు దుర్యోధన, దుశ్శాసన మమతాయే

## మండిపడ్డ బిజెపి నేత సంబిత్ పాత్ర

**కోల్‌కతా, డిసెంబర్ 31 :** కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను దుశ్శాసనుడితో పోలుస్తూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. దేశ హోం మంత్రిని బెదిరించడం ఏమిటని నిలదీసింది. పశ్చిమబెంగాల్‌కు దుర్యోధనుడు, దుశ్శాసనుడు కూడా మమతా బెనర్జీయేనని అభివర్ణించింది. ఎన్నికల సన్నాహకాలను సమీక్షించేందుకు మూడు రోజుల పర్యటనకు వచ్చిన కేంద్ర హోం మంత్రిని టీఎంసీ అధినేత్రి బెదిరించారని బీజేపీ ప్రతినిధి సంబిత్ పాత్ర తప్పుపట్టారు. తాము తలుచుకుని ఉంటే మమతా బెనర్జీని ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించిన చోటు నుంచి బయటకు అడుగు పెట్టకుండా చేసేవాళ్లమని అన్నారు. 'ఆ పని చేయకపోవడం మీ అదృష్టం' అని మమతను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మీరు బెదిరించినది అమిత్‌షాను కాదని, ఇండియాను బెదిరించారని అన్నారు. వరుసగా మూడు కీలక ఎన్నికలను తృణమూల్‌కు అప్పగించి ఓటమిపాలైనా ఈసారి మాత్రం బీజేపీ మూడింట రెండు వంతుల మెజారిటీతో బెంగాల్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని సంబిత్ పాత్ర ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎంపీ రాజు బిస్తా మాట్లాడుతూ, హోం మంత్రి అమిత్‌షాపై మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం గౌరవం లేకుండా ఉన్నాయని, ఒక ముఖ్యమంత్రి ఈ తరహాలో మాట్లాడటం సరికాదని అన్నారు. బీజేపీ కూడా ఇదే తరహా మాటలు మాట్లాడగలదని, కానీ అది తమ సిద్ధాంతం కాదని పేర్కొన్నారు. కాగా, మమతా బెనర్జీ వ్యాఖ్యలపై అమిత్‌షా ఇంతవరకూ స్పందించలేదు. బంగ్లా సరిహద్దుల నుంచి దేశంలోనికి అక్రమ చొరబాట్లకు మమతా బెనర్జీనే కారణమంటూ అమిత్‌షా మంగళవారంనాడు తప్పుపట్టారు. చొరబాట్లదార్లను తమ ఓటు బ్యాంకుగా ఆమె మార్చుకున్నారని ఆరోపించారు. సరిహద్దు ఫెన్సింగ్‌కు భూములు అడుగుతూ తాము ఏడు లేఖలు రాసినా సీఎం స్పందించలేదన్నారు. టీఎంసీ పాలనలో హింస, అవినీతి రాజ్యమేలాయని ఆరోపించారు. చొరబాట్ల సమస్య కేవలం రాష్ట్ర సమస్య కాదని, జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలపై మమత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 'బెంగాల్‌కు ఒక దుశ్శాసనుడు వచ్చారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ దుశ్శాసన, దుర్యోధనులు కనిపించడం మొదలవుతుంది. సమాచార సేకరణ కోసం దుశ్శాసనుడు వచ్చారు. పెన్సింగ్ కోసం మమతా బెనర్జీ భూములివ్వలేదని ఇవాళ వాళ్లు చెబుతున్నారు. నేను భూములు ఇవ్వకపోతే ఏమి జరిగి ఉండేది? పేట్రాపోల్‌లో భూములు ఇచ్చింది ఎవరు? ఆండాల్‌లో భూములు ఎవరిచ్చారు?' అని మమతాబెనర్జీ ప్రశ్నించారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఎస్ఐఆర్ పేరుతో ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారని బీజేపీని తప్పుపట్టారు.

# భార్యపై అనుమానంతో హత్య

**పల్నాడు, డిసెంబర్ 31 :** భార్యా, భర్తల మధ్య అనుబంధం రోజు రోజుకు క్షీణించిపోతోంది. అనుమానం పెనుభూతంగా మారుతోంది. కట్టుకున్న భార్యను మోసం చేసి వివాహేతర సంబంధాలు పెట్టుకున్న భర్తలు ఉన్నట్లే, భర్తలను మోసం చేస్తున్న భార్యలు కూడా ఉన్నారు. చిన్న చిన్న కారణాలతో దంపతుల మధ్య గొడవలు తారాస్థాయికి చేరుతున్నాయి. ఇక అనుమానం ఉన్న భార్యా,భర్తల సంగతి చెప్పక్కర్లేదు. అనమానం అనే రోగంతో భార్యను భర్త అతి కిరాతకంగా హత్య చేసిన ఘటనలు ఇటీవల చాలానే చూశాం. ఇప్పుడు తాజాగా పల్నాడు జిల్లాలోనూ ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. అనుమానానికి ఓ నిండు ప్రాణం బలైంది. పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మండలం వేలూరులో భార్యను భర్త దారుణంగా హత్య చేశాడు. వేలూరులో సాల్మన్ రాజు, పుష్ప దంపతులు నివాసముంటున్నారు. అయితే పెళ్ళైనప్పటి నుంచి భర్తకు భార్యపై అనుమానం ఉండేది. దీని కారణంగా ప్రతీరోజు ఇరువురి మధ్య గొడవలు జరిగేవి. అలాగే గత రాత్రి కూడా ఇదే విషయంపై దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కోపంతో ఊగిపోయిన భర్త సాల్మన్ రాజు భార్యపై అనుమానంతో పచ్చడి బండతో కొట్టాడు. తీవ్రంగా గాయపడిన పుష్ప అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ హత్యపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# యూట్యూబర్ అన్వేష్‌పై పోలీస్ కేసు

**హైదరాబాద్, డిసెంబర్ 31 :** యూట్యూబర్ అన్వేష్‌పై కేసు నమోదైంది. ఇటీవల సోషల్ మీడియాలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ సినీనటి కరాటే కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అభ్యంతర కంటెంట్ ప్రచారం చేశారని అందులో పేర్కొన్నారు. దీంతో అన్వేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అన్వేష్‌పై ఖమ్మంలోని ఖానాపురంహవేలి ఠాణాలోనూ ఇప్పటికే కేసు నమోదైంది. విశాఖపట్టణానికి చెందిన అన్వేష్ అనే యువకుడు విదేశాల్లో ఉంటూ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా హిందువులు పూజించే సీతాదేవి, ద్రౌపదీదేవిలపట్ల అసభ్యంగా ఇటీవల అతడు వీడియో విడుదల చేశాడు. దానవాయిగూడేనికి చెందిన జి.సత్యనారాయణరావు అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. యూట్యూబర్ అన్వేష్‌పై హైదరాబాద్‌లోని పంజాగుట్ట, ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ దేవతలు, మహిళలను కించపరిచేలా మాట్లాడాడని అన్వేష్‌పై ఫిర్యాదులు అందడంతో రెండు కేసులు నమోదు చేశారు. దేవీ దేవతలను యూట్యూబర్ అన్వేష్ దూషించాడని సినీ నటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్యాణి ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్నారు. దీనిపై త్వరలోనే అన్వేష్‌కు పంజాగుట్ట పోలీసులు నోటీసులు జారీ చేయనున్నారు. యూట్యూబర్ అన్వేష్ చేసిన వ్యాఖ్యలు సామాజిక భావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని ఖమ్మం అర్బన్ పోలీసులు వెల్లడించారు.

# ఆగని యూరియా కష్టాలు

## చల్లటి చలిలో క్యూలైన్లు

**వరంగల్, డిసెంబర్ 31 :** యూరియా కోసం రైతులు నరక యాతన పడుతున్నారు. ఎముకలు కొరికే చలిలోనే అవస్థలు పడుతూ రైతు వేదికల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో రైతు వేదిక వద్ద రాత్రి నుంచే ఎరువుల కోసం బారులు తీరారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండల కేంద్రంలోని గ్రోమోర్ రైతు సేవా కేంద్రం వద్ద తెల్లవారుజాము 3 గంటల నుంచే రైతులు క్యూలైన్లలో నిలబడ్డారు. చలికి దుప్పట్లు కప్పుకొని, స్వెటర్లు వేసుకుని టోకెన్ల కోసం రాత్రంతా ఉప్పరపల్లి రైతు వేదిక వద్ద జాగరణ చేశారు. వర్షాకాలంలో ఇబ్బందులు పడ్డా యాసంగి పంటకైనా సరిపడా యూరియా అందుతుందని ఆశతో మక్క, వరి పంటలు వేశామని, అయినప్పటికీ తిప్పలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించినా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. కేసీఆర్ పాలనలో నిరంతరం నిల్వ చేసే బఫర్ స్టాక్ 3.50 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 4 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉండేది. కానీ యూరియా సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం చావు తెలివితేటలను ప్రదర్శించింది. యూరియా నిల్వలను బస్తాల లెక్కలో 47,68,000 బస్తాలు ఉన్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. అంటే అంతా కలిపి 2.15 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అవుతుంది. ఈ లెక్కన రాష్ట్రంలో 12,700 గ్రామాలకు గానూ ఒక్కో గ్రామానికి అందుబాటులో ఉన్నది 376 యూరియా బస్తాలు మాత్రమే. ఇంతలా యూరియా కొరత ఉండటం కారణంగా రైతులు చలికి వణుకుతూ రైతు వేదికలు, సహకర సంఘాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి వచ్చింది.



## బాలసదనం చిన్నారులతో నూతన సంవత్సర వేడుకలు

### జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** బుధవారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో నివసిస్తున్న చిన్నారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కలసి భోజనం చేసి, వారి సంక్షేమం పట్ల జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. బాలల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. చిన్నారులతో కలిసి భోజనం చేస్తూ, వారితో ఆత్మీయంగా ముచ్చటించిన జిల్లా కలెక్టర్ వారు పెద్దయ్యాక ఏమవుతారో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల సమాధానాలను ఆనందంగా స్వీకరించి, వారి కలలు నెరవేరేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా 134.9 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బాలసదనం భవన నిర్మాణాన్ని పరిశీలించి అన్ని హంగులతో మార్చి లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ట్రైనీ రవితేజ, డిడబ్ల్యూఓ ప్రమీల, ఈ ఈ పి ఆర్ జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్రవంతి, సంబంధిత అధికారులు, బాల సదనం సిబ్బంది పాల్గొన్నారు.



## ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుంది : పొంగులేటి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ (టీజీవో) ఖమ్మం జిల్లా 2026 నూతన సంవత్సర క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ పౌర ప్రసారాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందరరేగా మంత్రి మాట్లాడుతూ, టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు, గెజిటెడ్ అధికారులు, ఉద్యోగులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కూడా ప్రభుత్వం ముందుంటుందని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా అభివృద్ధిలో గెజిటెడ్ అధికారుల పాత్ర అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవో కేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, అధ్యాపక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**రామారెడ్డి రాజ ముద్ర న్యూస్ :** మండలంలోని అన్నారం గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోయిన మంగలి కళావతి గారి కుటుంబానికి నూతనంగా ఏర్పాటు చేసిన అన్నారం గ్రామ సేవాసమితి ఆధ్వర్యంలో వారి కుటుంబానికి భరోసగా 3000రూపాయలు అదేవిదంగ గ్రామ సర్పంచ్ లత శ్రీనివాస్ 1000రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది, ఇలాంటి సేవా కార్యక్రమాలు ముందు ముందు ఈ సేవా సమితి ఆధ్వర్యంలో చేయడం జరుగుతుంది. అని సేవ సమితి సభ్యులు తెలిపారు . ఈ కార్యక్రమంలోసర్పంచ్ లత శ్రీనివాస్, ఉప సర్పంచ్ దయానంద్, సేవా సమితి సభ్యులు ఎండి సల్మాన్, వంచ నరేందర్ రెడ్డి,కుమ్మరి మురళి.సాయిరంగౌడ ,శ్రీకాంత్ రెడ్డి,గంగ రెడ్డి, కుక్కల రాజు,సతీష్ గౌడ్ ,జీవన్, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## వైజ్ఞానిక ప్రదర్శనలో సీజీఆర్ స్థాల్‌ను సందర్శించిన కలెక్టర్ తేజ నంద లాల్ పవర్

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** పాఠశాల విద్యాశాఖ సూర్యాపేట జిల్లా ఆధ్వర్యంలో జిల్లా విద్య వైజ్ఞానిక ప్రదర్శనను వి వి యం హైస్కూల్ హుజుర్నగర్ లో మంగళవారం, బుధవారాలలో ఘనంగా నిర్వహించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన లో డిపార్ట్మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, నాబార్డ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న పర్యావరణ స్టాలును ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యార్థిని, విద్యార్థులకు మరియు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు పర్యావరణ అంశాల గురించి అవగాహన కల్పించి గాలి, నీరు, భూమి కలుషితం కాకుండా ప్లాస్టిక్ నివారణ లో భాగస్వామ్యం కావాలని భవిష్యత్తురాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ జిల్లా లో పని చేస్తున్న పాఠశాల ల వివరాలతో పాటు పాఠశాల లో చేస్తున్న కార్యక్రమాల గురించి వైజ్ఞానిక ప్రదర్శనలో సీజీఆర్ స్థాల్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ తేజ నంద లాల్ పవర్, జిల్లా విద్యాధికారి అశోక్ కుమార్ కి సిజిఆర్ జిల్లా కోఆర్డినేటర్ మామిడి శంకరయ్య వివరించారు. ఈ కార్యక్రమం లో మెంటార్ టీచర్ విశ్వజ్ఞ చారి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# శాస్త్ర సాంకేతిక విప్లవానికి సైన్స్ ఫెయిర్‌లే పునాది

### డిప్యూటీ కమిషనర్ శైలజ

**మేడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా 'ఇన్నోవేషన్ సైన్స్ ఫెయిర్'**

- మేడిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ సహకారంతో ఇన్నోవేషన్ సైన్స్ ఫెయిర్
- విద్యార్థిని, విద్యార్థులకు అన్ని రంగాలలో ప్రోత్సాహం అందిస్తున్న ప్రధానోపాధ్యాయులు ఎల్ సత్య ప్రసాద్
- విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడమే సైన్స్ ఫెయిర్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం: హెచ్‌ఎం సత్యప్రసాద్
- ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు







**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ మేధస్సుకు పదను పెట్టాలని, సైన్స్ ఫెయిర్‌లు అద్భుతమైన సాంకేతిక విప్లవానికి తోడ్పడతాయని డిప్యూటీ కమిషనర్ శైలజ పేర్కొన్నారు. మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగస్త్య ఫౌండేషన్ సహకారంతో, ప్రధానోపాధ్యాయులు ఎల్ సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఇన్నోవేషన్ సైన్స్ ఫెయిర్' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సైన్స్ నమూనాలను ఆమె పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ సత్య ప్రసాద్ తో కలిసి ఆసక్తిగా తిలకించి, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె ప్రసంగించారు.

#### సృజనాత్మకతకు వేదిక - సైన్స్ ఫెయిర్

పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను, వినూత్న ఆలోచనలను వెలికితీయడమే ఈ సైన్స్ ఫెయిర్ యొక్క ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ప్రయోగాత్మక విద్య ద్వారా విద్యార్థులు విషయాన్ని సులభంగా అర్థం చేసుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, వారి ఉజ్వల భవిష్యత్తుకు పాఠశాల అండగా ఉంటుందని సత్యప్రసాద్ హామీ ఇచ్చారు.

#### ఆకట్టుకున్న ప్రదర్శనలు

అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధుల పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు.

- పర్యావరణ పరిరక్షణ, సౌరశక్తి వినియోగం.
- వ్యర్థ పదార్థాల నిర్వహణ (వేస్ట్ మేనేజ్మెంట్).
- స్మార్ట్ సిటీ నమూనాలు, రోబోటిక్స్.
- నీటి శుద్ధి ప్రక్రియలు వంటి అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను చాటారు.

#### ఉపాధ్యాయుల ప్రోత్సాహం

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు మార్గ నిర్దేశనం చేస్తూ చురుగ్గా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఇటువంటి వైజ్ఞానిక స్పృహను పెంపొందించడం పట్ల స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సైన్స్ ఫెయిర్ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఇది భవిష్యత్తులో వారు గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగడానికి దోహదపడుతుందని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు, వి అనురాధ, ప్రపూర్ణ, హరిచంద్, పి. రవి ప్రసాద్, ఉమా, శృతి, స్వరూప లు విద్యార్థుల ప్రాజెక్టుల తయారీలో కృషి చేశారు. ఈ సైన్స్ ఫెయిర్ లో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## హరీష్ రావుకు శుభాకాంక్షలు తెలిపిన సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్



**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** తెలంగాణ శాసన సభ ఫ్లోర్ లీడర్ గా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసిఆర్ హరీష్ రావును నియమించడం పట్ల 263 డివిజన్, పటాన్ చెరువు నాయకులు మాజీ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు మల్లేపల్లి సోమిరెడ్డి, 263 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాగం దేవేందర్ యాదవ్, లు హరీష్ రావు నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితోపాటు తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ బాబ్జి కోఆప్షన్ సభ్యుడు శ్రీపాల్ రెడ్డి నాయకులు సాగర్ ఇంద్ర రెడ్డి పాల్గొన్నారు.

## గుర్తు తెలియని శవం లభ్యం

**ఎడపల్లి, రాజముద్ర న్యూస్ :** ఎడపల్లి మండలంలోని జానకంపేట్ గ్రామ శివారులో ఉన్న అశోక్ సాగర్ చెరువులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. గురువారం ఉదయం చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎడపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలికి సుమారు 40నుండి 50 సంవత్సరాల వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతురాలి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నిజామాబాదు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి వివరాలు తెలిసినవారు ఎడపల్లి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై రమ కోరారు



## పోలీసు కుటుంబానికి ఆర్థిక చేయూత

### చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా నాగారం పోలీస్ స్టేషన్ నందు పని చేస్తూ కానిస్టేబుల్ కమలాకర్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల అకాలంగా మరణించడం జరిగినది. దివంగత పోలీసు సిబ్బంది కుటుంబాల అవసరాలు తీర్చడం లో భాగంగా పోలీసు చేయూత పథకం ద్వారా కమలాకర్ కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల పోలీసు చేయూత పథకం చెక్కును ఎస్పీ నరసింహ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు కమలాకర్ కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపినారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బంది ప్రతి నెల జీతం నుండి విరాళం అందిస్తున్నారు అని అభినందించారు, పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ లు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, డిఎస్పీ లు ప్రసన్నకుమార్, శ్రీనివాస్ రెడ్డి,నరసింహ చారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజు భార్గవి, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్, వెలోరే ఆర్ఎస్ఐ సాయిరాం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## చేప పిల్లలను పంపిణీని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి

### రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్

**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్ :** పటాన్ చెరువు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం మండలం రాయసముద్రం చెరువులో, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించిన 75 వేల చేప పిల్లలను రాయసముద్రం చెరువులో, ఫిషరీస్ డిపార్ట్మెంట్, అధికారులు, స్థానిక మత్స్యకారుల తో, ఓల్డ్ రామచంద్రాపురం నాయకులు స్థానికులతో కలిసి విడుదల చేసిన రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, ఈ సందరరేగా జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థిక అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుంది. వీటిని మత్స్యకారులు సరైన పద్ధతిలో అధికారుల సూచనలతో పెంచి ఆర్థికంగా ఎదగాలని ఈ సందరరేగా కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు.

## పటాన్ చెరువు నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

### సంగారెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి ఉప్పరపల్లి సుధాకర్ రెడ్డి



**పటాన్ చెరువు, రాజముద్ర న్యూస్:** 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2026వ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఉప్పరపల్లి సుధాకర్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన పేద మధ్యతరగతి ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చే అనేక పథకాలతో ముందుకు సాగుతుంది. సంగా రెడ్డి జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి చేర్చే విధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎప్పటికప్పుడు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తూ పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సౌలభ్యం కొరకు అందుబాటులో ఉంటున్నారు.



## హెడ్మాస్టర్ గోపాల్ రెడ్డి పదవి విరమణ శుభాకాంక్షలు

**మోత్కూర్. రాజముద్రన్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించి విద్యార్ధులను సక్రమమైన మార్గంలో నడిపించిన తీపిరెడ్డి గోపాల్ రెడ్డి నేడు మోత్కూరులో పదవీ విరమణ పొందారు. ఈ సందరరేగా మోత్కూరులో ఏర్పాటు చేసిన సన్మాన సభలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి,మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ తీపిరెడ్డి గోపాల్ రెడ్డి కి ఘనంగా సన్మానించి చిరు సత్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దిగోజు నరసింహ చారి,మాజీ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి,ఎద్దు వెంకన్న,చెరుకు శ్రీను,పోతగాని మల్లేశం,ఎలగందుల శ్రీను, ఆరె వెంకన్న,గడ్డం హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట ప్రకారం ఐమాక్స్ లైట్ల ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ నగేష్

**ఆత్మకూర్ ( ఎం) రాజముద్ర న్యూస్ :** ఆత్మకూరు (ఎం) పట్టణ కేంద్రంలో రాంనగర్ హనుమాన్ యూత్ దగ్గర ఇచ్చిన మాట ప్రకారం ఐమాక్స్ లైట్ లను ఏర్పాటు చేసిన మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు తను ఇచ్చిన మాట ప్రకారం హనుమాన్ యూత్ కి 1,10,000/- విలువ గల ఐమాక్స్ లైట్ లను ఏర్పాటు చేశానని ఓడిన గెలిచిన ప్రజా క్షేత్రంలో ఉంటానని తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్య నా సమస్యగా భావిస్తూ ఆత్మకూర్ అభివృద్ధి ద్వేయంగా పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం గౌడ్,9 వ వార్డు సభ్యులు తవిటి శైలజ రాజు, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎద్దు వెంకటేశ్వర్లు,పైళ్ల దామోదర్ రెడ్డి, చెరుకు శ్రీను, లోడి మధు ,ఎలాగందుల శ్రీను, తొండల అనిల్, కోరే మహేష్, రంగా, శ్రీకాంత్ మరియు హనుమాన్ యూత్ కమిటి సభ్యులందరూ పాల్గొన్నారు.



## దుర్గామాతకి మొక్కులు చెల్లించుకున్న జంగులు నాగరాణి

**ఆత్మకూర్ (ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం).మండలం పల్లెర్ల గ్రామంలో పల్లెర్ల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా తండ మంజుల నర్సింహా గౌడ్ గెలుస్తే 101 కొబ్బరికాయలు కొడుతా అని దుర్గామాతకి మొక్కులు మొక్కిన కాంగ్రెస్ పార్టీ నాయకులు వస్తుపుల జంగులు నాగరాణి దంపతులు తండ మంజుల నర్సింహా గౌడ్ సర్పంచ్ గా భారీ మెజార్టీతో గెలుపొందరు ఈ సందర్భంగా వస్తుపుల జంగులు నాగరాణి దుర్గామాతకి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వారికీ మరియు మీడియా ప్రతినిధులకు శాలువాతో సన్మానం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని పూజలు చేసిన ఆత్మకూర్ మాజీ జడ్పిటీసీ నరేందర్ గుప్తా మాజీ ఎంపీటీసీ మల్లారెడ్డి ఈ కార్యక్రమం లో బీజేపీ పార్టీ ఆరోవ వార్డు సభ్యులు మణికాంత్ కాంగ్రెస్ పార్టీ ఏడోవ వార్డు సభ్యులు జ్యోతి మచ్చ గిరి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగస్వామి సీనియర్ నాయకులు అంజయ్య ఎల్లయ్య రాములు మచ్చగిరి మల్లేష్ యూత్ నాయకులు రాజు మల్లేష్ పాల్గొన్నారు.





## నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు

**ఆత్మకూరు (ఎం).రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం). నూతన సంవత్సరం సందర్భంగా మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ లకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు శ్రీ బీర్ల ఐలయ్య ఈ సందర్భంగా తన బీర్ల ఫౌండేషన్ సభ్యులు బత్తిని ఉప్పలయ్య మరియు బలరాం చేతుల మీదుగా పార్టీలకు అతీతంగా నూతనంగా గెలుపొందిన మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులకు నూతన సంవత్సర స్పెషల్ గ్రీటింగ్ కార్డ్స్, క్యాలెండర్ లు, స్వీట్ బాక్స్ లు పంపిణి చేసిన ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య, సర్పంచులు అందరూ ప్రజా సేవలో ఉండాలని గ్రామాల అభివృద్ధి సంక్షేమ పనులలో భాగస్వాములు కావాలని వారికి తమ అండదండలు ఉంటాయని హామీ ఇచ్చినట్లు బీర్ల ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

## పట్టపగలే నిద్రమత్తులో నేలకొండపల్లి ఎక్సైజ్ కానిస్టేబుల్

- నేలకొండపల్లిలో వైరలవుతున్న ఫోటోలు, వీడియోలు
- చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకుల డిమాండ్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు నేనే రాజు,నేనే మంత్రి అంటూ కుర్చీలోనే కునుకు తీస్తున్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో, పారదర్శకంగా విధులు నిర్వహించాల్సింది పోయి పట్టపగలే హాయిగా నిద్ర పోతున్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సెంట్రీ విధులు నిర్వహిస్తున్న ఓ మహిళ ఎక్సైజ్ కానిస్టేబుల్ విధులను విస్మరించి విధి నిర్వహణలోనే నిద్రలోకి జారుకున్న తీరు చర్చనీయాంశంమైంది. అక్రమ మద్యం ఉత్పత్తి,మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం, మద్యపానానికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించాల్సిన ఆబ్కారీ శాఖ అధికారులు విధుల్లో ఉదాసీనంగా వ్యవహరించడం పై ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నిద్ర మత్తు వదిలేనా..!

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ సెంట్రీగా విధులు నిర్వహించాల్సిన బాధ్యత కలిగిన ఎక్సైజ్ కానిస్టేబుల్ నిద్ర పోతున్న వీడియో,ఫొటోలు వైరల్ గా మారాయి. ప్రోహిభిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సెంట్రీగా(పహరా) విధులు నిర్వహించే సమయంలో సదరు ఉద్యోగి నిద్రపోకుండా మేల్కొని ఉండాలి. కార్యాలయంతో పాటుగా సంబంధిత ఆస్తులను తప్పనిసరిగా సంరక్షించాలి. ప్రదేశంలోని అనుమానాస్పద కదలికలను గమనిస్తూ పట్టుబడిన గంజాయి, గుడుంబా, అక్రమ మద్యం రవాణా వాహనాలు,ప్రభుత్వ వాహనాలు, కార్యాలయ రికార్డులను కాపాడాలి. కానీ ఇవేమీ పట్టని ఎక్సైజ్ కానిస్టేబుల్ కులాసాగా నిద్ర మత్తులోకి జారుకున్నారు. ఏదైనా జరగరానిది జరిగి ప్రభుత్వ,పట్టుబడిన వాహనాలను తస్కరిస్తే ఎవరు బాధ్యత వహిస్తారనేది అంతుచిక్కని ప్రశ్న. ప్రభుత్వం నుండి వేల రూపాయలను వేతనంగా అందుకుంటూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్యాలయంలోనే మొద్దు నిద్రపోవడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి : బీజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్



అక్రమ మద్యం,గంజాయి వంటి మత్తు పదార్థాల సరఫరాను అడ్డుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ ఉద్యోగులే పట్టపగలు కార్యాలయంలో నిద్ర పోవడం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడమేనని బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ తెలిపారు. జిల్లా ప్రోహిభిషన్ అండ్ ఎక్సైజ్ కమీషనర్ విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎడపల్లిలో పీఆర్టీయూ 2026 క్యాలెండర్ ఆవిష్కరించిన ఎంఈఓ



**ఎడపల్లి, రాజముద్ర న్యూస్ :** ఎడపల్లి మండల కేంద్రంలో పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. మండల విద్యాధికారి శివలింగ్ గాలప్ప ముఖ్య అతిథిగా హాజరై ఈ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ శివలింగ్ గాలప్ప మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ సంఘం ఎల్లప్పుడూ క్రియాశీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పీఆర్టీయూ మండల బాధ్యులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల హక్కుల సాధన, వారి సంక్షేమమే ధ్యేయంగా తమ సంఘం నిరంతరం పనిచేస్తుందని స్పష్టం చేశారు. నూతన సంవత్సరంలోనూ ఉపాధ్యాయులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చెల్లడి సాయిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి తూప్రాన్ గోవర్ధన్, మండల అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వేతనం ఆధారంగా హెచ్-1బీ

### లాటరీలో మార్పులివే..




**యూఎస్ :** వృత్తి నిపుణులకు ఇచ్చే హెచ్-1బీ వీసాల జారీ ప్రక్రియలో కీలక మార్పులు చేపట్టాలని నిర్ణయించిన అమెరికా.. అందుకు సంబంధించిన నిబంధనలను తాజాగా ప్రకటించింది. ఈ మేరకు వీసా కేటాయింపుల విధి విధానాలను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్.. ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించింది. ఈ కొత్త పద్ధతి వచ్చే ఏడాది ఫిబ్రవరి 27 నుంచి అమల్లోకి రానుంది. 2027 ఆర్థిక సంవత్సరం హెచ్-1బీ క్యాప్ రిజిస్ట్రేషన్ సీజన్‌కు ఇది వర్తించనుంది. ఈ కొత్త విధానంలో ఇప్పుడు ఉన్నట్లుగా ర్యాండమ్‌గా హెచ్-1బీ వీసాలు జారీ చేయరు. అత్యధిక వేతనాలు, అధిక నైపుణ్యాలు ఉన్న వ్యక్తులకు వీసా పొందే అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. ఇక, తక్కువ జీతం లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు వీసా ఎంపిక ప్రక్రియలో తక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

### లాటరీ విధానంలో వచ్చే మార్పులివే..

ఈ కొత్త పద్ధతి కోసం హెచ్-1బీ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలను అమెరికా కార్మిక శాఖ క్రమబద్ధీకరించింది. నాలుగంచెల వేతన వ్యవస్థగా విభజించింది. ఎంట్రీ లెవల్ వర్కర్లను లెవల్-1గా.. నైపుణ్యం కలిగిన ఉద్యోగులను లెవల్-4గా పరిగణించింది. ఇందులో ఎంట్రీ లెవల్ ఉద్యోగులకు ఇప్పటిలాగే ర్యాండమ్ విధానంలో లాటరీ తీయనున్నారు. మిగతా వారికి మాత్రం వారి వేతన స్థాయి ఆధారంగా లాటరీలో ఎక్కువ అవకాశాలు లభిస్తాయి. అత్యధిక వేతనం కలిగిన లెవల్-4 ఉద్యోగులకు నాలుగు సార్లు లాటరీలోకి ప్రవేశించే వీలు ఉంటుంది. అంటే.. వారు వీసాలకు ఎంపికయ్యే అవకాశం 61 శాతం ఉంటుంది. లెవల్-3 ఉద్యోగులు మూడుసార్లు లాటరీలోకి వెళ్లొచ్చు. దీంతో వీరికి వీసాలు పొందే అవకాశం 46 శాతం లభిస్తుంది. లెవల్-2 ఉద్యోగులు రెండు సార్లు లాటరీలోకి ప్రవేశించే వీలు ఉంటుంది. వీసాలు లభించే ఛాన్స్ 31 శాతంగా ఉండనుంది. ఇక, లెవల్-1 ఉద్యోగులు ఒకేసారి లాటరీలో ఉంటారు. దీంతో గతంతో పోలిస్తే ఇప్పుడు వీరికి వీసా లభించే ఛాన్స్ 15 శాతం తగ్గనుంది.

## ఎస్ఎస్ఎల్వీ మూడో స్టేజ్ పరీక్ష విజయవంతం



**శ్రీహరికోట :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో ముందడుగు వేసింది. స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మూడో దశను విజయవంతంగా పరీక్షించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని సాలిడ్ మోటార్ స్టాటిక్ టెస్ట్ కేంద్రంలో మంగళవారం ఈ ప్రయోగం నిర్వహించింది. మూడు-దశల ఆల్-సాలిడ్ లాంచ్ వెహికల్ ఎస్ఎస్ఎల్వీ పనితీరును విశ్లేషించడంతోపాటు డేటాను సేకరించినట్లు ఇస్రో వెల్లడించింది. అంతరిక్షంలోకి చిన్న ఉపగ్రహాలను వేగంగా ప్రయోగించడం కోసం దీనిని రూపొందించారు. అధిక స్థాయిలో ఉత్పత్తికి కూడా ఇది అనుకూలంగా ఉంటుంది. పేలోడ్‌కు సెకనుకు 4 కి.మీ వేగాన్ని అందించడంలో ఎస్ఎస్-3 కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు వెల్లడించారు. పేలోడ్ సామర్థ్యాన్ని సుమారు 90 కిలోల వరకు మెరుగుపరుస్తుందన్నారు. ప్రస్తుతం చేసిన అప్‌గ్రేడ్‌లు ఈ దశలో మెరుగైన ఇగ్నైటర్, నాజిల్ డిజైన్ ఉపగ్రహాల సామర్థ్యం, నిర్మాణాత్మక దృఢత్వాన్ని పెంచినట్లు తెలిపారు. ఈ పరీక్షలో ఒత్తిడి, థ్రస్ట్, ఉష్ణోగ్రత, వైబ్రేషన్, యాక్చుయేటర్ పనితీరు వంటి విషయాలను పరిశీలించినట్లు తెలిపారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండించిన యూకే



**యూకే :** బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా కొనసాగుతోన్న దాడులపై యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీలైన దీపూ చంద్రదాస్, అమృత్ మండల్, బజేంద్ర బిశ్వాస్‌ల హత్యలను ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. దీపూ హత్య కేసులో బంగ్లాదేశ్ పోలీసులు ఇప్పటికే 12 మందిని అరెస్టు చేయడాన్ని.. ఆ దేశంలో అన్నివర్గాల భద్రతకు ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తు న్నట్లు తెలిపారు. ప్రజల మత స్వేచ్ఛ, విశ్వాసాలను కాపాడటానికి యూకే ప్రభుత్వం కట్టుబడి ఉందని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. నవంబర్‌లో తమ మంత్రి జెన్నీ చాప్‌మన్.. యూనస్‌ను కలిసిన సమయంలో కూడా బంగ్లాలో మైనారిటీల రక్షణ అంశాన్ని లేవనెత్తినట్లు తెలిపారు. పౌర, మానవ హక్కులను రక్షించడంలో.. అవినీతిని ఎదుర్కోవడంలో బంగ్లాదేశ్‌కు బ్రిటన్ మద్దతు కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతోన్న అల్లర్ల వేళ ఇస్లాంకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడన్న ఆరోపణలతో ఇటీవల 25 ఏళ్ల దీపూ చంద్రదాస్ అనే హిందూ వ్యక్తిపై అల్లరిమూకలు దాడి చేసి, హత్య చేశాయి. మరో ఘటనలో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నాడనే ఆరోపణలతో అమృత్ మండల్ అనే మైనారిటీ వ్యక్తిని గ్రామస్థులు కొట్టి చంపారు. మంగళవారం బజేంద్ర బిశ్వాస్ అనే మరో హిందువుని అతడి సహోద్యోగి తుపాకీతో కాల్చి చంపాడు. హిందువులపై వరుసగా జరుగుతున్న దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.



## డెన్మార్క్‌లో తపాలా సేవలు నిలిపివేత

**డెన్మార్క్:** డెన్మార్క్ ప్రభుత్వం.. దాని 400 సంవత్సరాల సంప్రదాయానికి స్వస్తి పలకాలని నిర్ణయించింది. దేశంలోని పోస్టల్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ప్రజలు డిజిటల్ కమ్యూనికేషన్ వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తపాలా సేవలను ముగించిన తొలి దేశంగా డెన్మార్క్ నిలిచింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'పోస్ట్‌నార్డ్' అనే సంస్థ అనేక సంవత్సరాలుగా పోస్టల్ సేవలు అందిస్తోంది. డిజిటల్ కమ్యూనికేషన్ ఎక్కువైన నేపథ్యంలో లేఖలకు ఆదరణ తగ్గిపోయింది. ఈ క్రమంలో వీటి సేవలను పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. అయితే ఆన్‌లైన్ షాపింగ్‌లపై ప్రజలు ఎక్కువ మొగ్గు చూపుతున్న క్రమంలో పార్సిల్ సర్వీసులను మాత్రం కొనసాగించనున్నట్లు పోస్ట్‌నార్డ్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే దేశంలోని రెడ్ మెయిల్‌బాక్స్‌లను ప్రభుత్వం తొలగిస్తూ వస్తోంది. జూన్ నుంచి ఇప్పటివరకు దాదాపు 1,500 మెయిల్ బాక్స్‌లను తొలగించింది. డిసెంబరులో వీటిని స్వచ్ఛందసంస్థల కోసం విక్రయించింది. అయితే వీటిని డెన్మార్క్ ప్రజలు సైతం కొనుగోలుకు ఆసక్తి చూపించారు. పోస్టల్ సేవలు నిలిపివేసినా ఇంకా భౌతికంగా లేఖలు రాసి పంపే వారి కోసం.. డావో అనే ప్రైవేటు కొరియర్ సర్వీసును వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



## పెయిన్‌కిల్లర్ ఔషధం అధిక డోసులపై నిషేధం

### కేంద్రం ప్రకటన

**న్యూఢిల్లీ :** ప్రముఖ పెయిన్‌కిల్లర్ ఔషధం నిమెసులైడ్ తయారీ, విక్రయాలపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. నోటి ద్వారా తీసుకొనే ఈ ఔషధం అధిక డోసులపై నిషేధం విధించింది. ఆరోగ్యపరమైన భద్రతా కారణాల రీత్యా నిమెసులైడ్ 100 ఎంజీకి మించి డోసు ఉండే ఔషధాల తయారీ, విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది. ఈ మేరకు డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుతో చర్చించిన అనంతరం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ దీనిపై నోటిఫికేషన్ జారీ చేసింది. "100 ఎంజీ కంటే అధిక డోసు ఉండే నిమెసులైడ్‌ను తీసుకోవడం వల్ల మనుషుల ఆరోగ్యానికి ప్రమాదం కలిగే అవకాశం ఉంది. ఇక దీనికి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయ ఔషధాలు కూడా అందుబాటులో ఉన్నాయి. అందుకే దీన్ని తక్షణమే నిషేధిస్తున్నాం" అని ఆరోగ్యశాఖ వెల్లడించింది. నిమెసులైడ్ అధిక డోసు ఉండే ఔషధం తయారీ, విక్రయాలు, పంపిణీపై ఈ నిషేధం వర్తించనుంది. తక్కువ డోసు ఫార్ములా ఉన్న నిమెసులైడ్ ఎప్పటిలాగే మార్కెట్‌లో అందుబాటులో ఉంటుంది. నిమెసులైడ్ అనేది నాన్ స్టెరాయిడ్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డ్రగ్. దీనివల్ల దుష్ప్రభావాలు ఉన్నట్లు గత కొంతకాలంగా చర్చ జరుగుతోంది. కాలేయంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గతంలో నిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం దీని వినియోగంపై ఆంక్షలు విధించింది. కేంద్రం నిర్ణయంతో నిమెసులైడ్ ఆధారిత పెయిన్ కిల్లర్ బ్రాండ్లను తయారుచేసే ఫార్మా కంపెనీలు వెంటనే తమ ఉత్పత్తిని నిలిపివేయాల్సి ఉంటుంది. మార్కెట్లోకి ఇప్పటికే పంపిన ఈ ఔషధాలను రీకాల్ చేయనున్నారు. గతంలోనూ కేంద్ర ప్రభుత్వం ఇలా ఆరోగ్యపరమైన భద్రతా కారణాలతో కొన్ని అధిక డోసు ఔషధాలను నిషేధించింది.

# నేడు సీఈఓ పదవి నుంచి దిగిపోనున్న వారెన్ బఫెట్

ఆధునిక కార్పొరేట్ నాయకత్వ చరిత్రలో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకోనుంది. ప్రపంచ దిగ్గజ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్ బెర్క్‌షైర్ హాత్‌వే సీఈఓ పదవి నుంచి నేడు దిగిపోనున్నారు. బెర్క్‌షైర్‌కు సుమారు 60 ఏళ్ల పాటు సీఈఓగా వ్యవహరించిన ఆయన.. గ్రెగ్ అబెల్‌కు తన పగ్గాలు అప్పగించారు. బఫెట్ 1965లో బెర్క్‌షైర్ హాత్‌వే బాధ్యతలు స్వీకరించారు. టెక్స్‌టైల్, బీమా, రైల్‌రోడ్స్, కన్జ్యూమర్ బ్రాండ్, ఈక్విటీల్లోకి మూలధనాన్ని మళ్లించారు. క్రమశిక్షణ, దీర్ఘకాలిక వ్యూహాలతో ఆయన అనుసరించిన మదుపు వ్యూహాలు వాటాదారులకు భారీ లాభాలను తెచ్చి పెట్టాయి. స్టాక్‌మార్కెట్ ప్రపంచంలో గొప్ప ఇన్వెస్టర్‌గా ఖ్యాతి గడించారు. పెట్టుబడులతో అపర కుబేరుడిగా మారిన ఆయన పాటించిన, చెప్పిన మదుపు సూత్రాలు పెట్టుబడిదారులకు ఆచరణీయంగా మారాయి. తాను బెర్క్‌షైర్ హాత్‌వే బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు ఇప్పటికే బఫెట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. జనవరి ఒకటిన నూతన నాయకత్వం బాధ్యతలు చేపట్టనుంది. తన రెండో కుమారుడు హువర్డ్ బఫెట్ కంపెనీ ఛైర్మన్‌గా, గ్రెగ్ అబెల్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించనున్నారు. సీఈఓగా వీడ్కోలు పలుకుతూ ఇన్వెస్టర్లకు ఇప్పటికే ఆయన లేఖ రాసిన సంగతి తెలిసిందే. తాను 95 ఏళ్ల పాటు జీవించడం అదృష్టమని, అదే సమయంలో ఒకింత ఆశ్చర్యం కూడా కలుగుతోందని రాసుకొచ్చారు. 1938లో తనకు 8 ఏళ్ల వయసులో అపెండిసైటిస్ వచ్చిందని, అప్పట్లో చావు అంచుల వరకు వెళ్లి తిరిగొచ్చానని లేఖలో ప్రస్తావించారు. ఆ సందర్భంగా తన 1.3 బిలియన్ డాలర్ల సంపదను నాలుగు ఫ్యామిలీ



ఫౌండేషన్స్‌కు బఫెట్ విరాళంగా ప్రకటించారు. మొత్తం 1800 షేర్లను 27 లక్షల షేర్లుగా విభజించి నాలుగు ఫౌండేషన్లకు పంచారు. ఇప్పటికే 50 బిలియన్ డాలర్ల సంపదను దాతృత్వం కోసం ఖర్చు చేశారు.






# 546 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

**ముంబయి:** దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నాలుగు రోజులుగా వరుస నష్టాలు చవిచూస్తున్న సూచీలు.. 2025 చివరి ట్రేడింగ్ సెషన్‌ను మాత్రం లాభాలతో ముగించాయి. ఓ వైపు విదేశీ మదుపర్ల విక్రయాలు కొనసాగుతున్నా.. మన మార్కెట్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. ఒక్క ఐటీ మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లలో కొనుగోళు నమోదయ్యాయి. దీంతో ఒక్కరోజులోనే మదుపర్ల సంపద రూ.4 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.472 లక్షల కోట్ల నుంచి రూ.476 లక్షలకు కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 84,793.58 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,675.08) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 750 పాయింట్లకు పైగా లాభపడి 85,437.17 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 545.52 పాయింట్ల లాభంతో 85,220.60 వద్ద ముగిసింది. నిఫ్టీ 190.75 పాయింట్ల లాభంతో 26,129.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.88గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇనోసేస్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 61.44 వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4321 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# ఏజీఆర్ బకాయిలు..
## వొడాఫోన్-ఐడియాకు భారీ ఉపశమనం

అప్పుల ఊబిలో కూరుకుపోయిన టెలికాం కంపెనీ వొడాఫోన్-ఐడియాకు కేంద్ర క్యాబినెట్ భారీ ఊరట కల్పించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాలకు (ఏజీఆర్) సంబంధించి రూ.87,695 కోట్ల బకాయిలను ఫ్రీజ్ చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని 2032-41 మధ్య చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. అంటే ఈ మొత్తాన్ని వొడాఫోన్ ఐడియా ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ మద్దతు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వొడాఫోన్ ఐడియాకు ఇది ఊరట కల్పించే అంశం. మారటోరియం పీరియడ్‌కు గానూ బకాయిలపైనా వొడాఫోన్ ఐడియా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. అంతేకాదు నిలుపుదల చేసిన బకాయిలను టెలికాం విభాగం పునః మదింపు చేస్తుంది. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ఏజీఆర్ బకాయిలు మాత్రం 2025-26 నుంచి 2030-31 మధ్య యథాతథంగా చెల్లించాల్సి ఉంటుంది. వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49% వాటా ఉంది. దీంతో పాటు 20 కోట్ల మంది చందాదారులు ఈ నెట్‌వర్క్‌ను వినియోగిస్తున్నారు. వారి ప్రయోజనాలు, టెలికాం రంగంలో పోటీ ఉండాలన్న ఉద్దేశంతో కేబినెట్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ శుభవార్త ఉంటుందని మదుపర్లు ముందుగానే ఊహించారు. దీంతో బుధవారం వొడాఫోన్ ఐడియా షేర్లు 4 శాతం మేర పెరిగి రూ.12.50 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకాయి. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా నిర్ణయం వెలువడకపోవడంతో ఒక్కసారిగా పతనం అయ్యా యి. మొత్తం బకాయిల్లో కనీసం సగమైనా ప్రభుత్వం రద్దు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. అంచనాలు అనుగుణంగా నిర్ణయాలు లేకపోవ డంతో క్యాబినెట్ నిర్ణయం వెలువడిన వెంటనే వీఐ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. మధ్యాహ్నం 2.30 గంటల సమయానికి 15 శాతం నష్టపోయి రూ.10.25 శాతం వద్ద వొడాఫోన్ ఐడియా షేర్లు ట్రేడవుతున్నాయి.




# గిగ్ వర్కర్ల సమ్మె వేళ
## ప్రోత్సాహకాలు పెంచిన స్విగ్గీ, జొమాటో

గిగ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో డెలివరీ ఏజెంట్లకు స్విగ్గీ, జొమాటో ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాయి. ఏడాది చివరిరోజున కార్యకలాపాలకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో ప్రోత్సాహకాలను పెంచాయి. పని పరిస్థితులు, సామాజిక భద్రత వంటి అంశాలపై గిగ్ వర్కర్లు సమ్మెకు దిగిన వేళ.. ఆయా కంపెనీలు ఈ ప్రకటన చేయడం గమనార్హం. సాధారణ రోజుల కంటే పండగ, ప్రత్యేక రోజుల్లో ఆర్డర్లు పెద్ద సంఖ్యలో వస్తుంటాయి. డిసెంబర్ 31 సాయంత్రం కూడా ఈ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీంతో సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల మధ్య పనిచేసే వర్కర్లకు ఒక్కో ఆర్డర్‌కు రూ.120-150 చెల్లిస్తామని జొమాటో పేర్కొంది. ఈ మేరకు వారికి సందేశాలు పంపిస్తోందని సమాచారం. ఆర్డర్, అందుబాటును బట్టి ఒక్కొక్కరూ సగటున రూ.3 వేలు ఆర్జించొచ్చని అందులో పేర్కొంటోంది. క్యాన్సిలేషన్లు, ఆర్డర్ తీసుకోకపోవడం వంటి వాటిపై పెనాల్టీలు కూడా విధించబోమని ఆ సందేశాల్లోని సారాంశం. స్విగ్గీ సైతం దాదాపు ఇదేతరహా ఆఫర్ ప్రకటించింది. డిసెంబర్ 31, జనవరి 1న పనిచేసే వర్కర్లు పెద్ద మొత్తంలో సంపాదించుకోవచ్చని సందేశాలు పంపిస్తోంది. సాయంత్రం 6 గంటల నుంచి 12 గంటల మధ్య పీక్ అవర్స్‌లో ఒక్కొక్కరూ గరిష్ఠంగా రూ.2వేలు సంపాదించొచ్చని తెలిపింది. డెలివరీ ఏజెంట్ల సమ్మె వేళ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సైతం ప్రోత్సాహకాలు పెంచినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. న్యూ ఇయర్ వేళ అమ్మకాలకు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో ఆయా సంస్థలు ఈ ప్రోత్సాహకాలు ప్రకటించినట్లు తెలుస్తోంది. దీనిపై స్విగ్గీ, జొమాటో, జెప్టో అధికారికంగా స్పందించలేదు. దేశవ్యాప్తంగా డిసెంబర్ 25న ఒకసారి సమ్మె చేపట్టిన గిగ్ వర్కర్లు.. నేడు కూడా పెద్ద సంఖ్యలో సమ్మెలో పాల్గొన్నారు. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ సమ్మె జరుగుతోంది. దీంతో స్విగ్గీ, జొమాటో, జెప్టో, అమెజాన్ వంటి సేవలపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత వంటివి వర్కర్లు కోరుతున్నారు. 10 నిమిషాల్లో డెలివరీని పూర్తిగా రద్దు చేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేస్తున్నారు.



# నాలుగు మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు..
## పడిక్కల్ వన్డేలకు ఎంపికవుతాడా?

విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. నాలుగు మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు చేసి వన్డే జట్టు రేసులో తాను కూడా ఉన్నట్లు సెలక్టర్లకు సందేశం పంపాడు. ఇవాళ పుదుచ్చేరితో జరుగుతున్న మ్యాచ్‌లో పడిక్కల్ (113, 116 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ చేశాడు. ఝార్ఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక 413 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో ఈ కుర్రాడిదే ఇదే కీలకపాత్ర. ఆ పోరులో 118 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 147 పరుగులు చేశాడు. కేరళపై (124, 137 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) మరోసారి శతకంలో మెరిశాడు. తమిళనాడుపై 12 బంతుల్లో 22 రన్స్ చేసి వెనుదిరిగిన దేవ్‌దత్ పడిక్కల్.. మొత్తం నాలుగు మ్యాచ్‌ల్లో 405 పరుగులు చేశాడు. పడిక్కల్ నిలకడగా ఆడతున్నందున త్వరలో కివీస్ వన్డే సిరీస్‌కు అతడి పేరును సెలక్టర్లు తప్పకుండా పరిగణనలోకి తీసుకునే అవకాశముంది. ఎందుకంటే ఒక్కసారి క్రీజులో కుదురుకుంటే భారీ ఇన్నింగ్స్‌లు ఆడే సత్తా ఇతని సొంతం. ఛేజింగ్‌లోనూ దూకుడు చూపించగలడు అనడానికి ఝార్ఖండ్‌పై ఆడిన 147 పరుగుల ఇన్నింగ్స్ నిదర్శనం. సాధారణంగా ఓపెనర్‌గా వచ్చే పడిక్కల్‌కు.. లిస్ట్-ఎ క్రికెట్‌లో మంచి రికార్డు ఉంది. కేవలం 36 ఇన్నింగ్స్‌ల్లో 12 సెంచరీలు, 12 అర్ధ శతకాలు చేశాడు. ఈ కర్ణాటక కుర్రాడు భారత్ తరఫున ఇప్పటి వరకు రెండు టెస్టులు, రెండు టీ20 ఆడాడు. వన్డేల్లో మాత్రం ఇంకా అరంగేట్రం చేయలేదు. మరి జనవరి 11 నుంచి ప్రారంభంకానున్న మూడు వన్డేల సిరీస్‌కు పడిక్కల్‌ను ఎంపిక చేస్తారో లేదో చూడాలి.




# 2026లో భారత జట్టు చాలా బిజీ షెడ్యూల్

భారత పురుషుల క్రికెట్ జట్టు షెడ్యూల్ 2026లో చాలా బిజీగా ఉండబోతోంది. వచ్చే ఏడాది క్యాలెండర్‌లో ప్రతిష్ఠాత్మక టోర్నీలు ఆడనున్న టీమ్?ఇండియాకు కీలకం కానుంది. ఒకవైపు, భారత్ ఆతిథ్యమిచ్చే టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. మరోవైపు, ఈ ఏడాది టెస్ట్ క్రికెట్‌లో కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి సంపాదించుకోవడం ఇప్పుడు భారత జట్టు ముందున్న అతిపెద్ద సవాల్ మారింది. ముఖ్యంగా సొంతగడ్డపై దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన పరాజయం భారత టెస్ట్ చరిత్రలోనే ఘోరమైన ఓటమిగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో 2026లో జరిగే టెస్ట్ సిరీస్‌లు భారత జట్టుకు పరీక్షగా మారనున్నాయి. అఫ్గానిస్థాన్, శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనల్లో టెస్టులు ఆడనుంది. ఈ క్రమంలో భారత్ తిరిగి ప్రపంచ టెస్ట్ క్రికెట్‌లో తన స్థానం నిలబెట్టుకోగలదా? వైట్‌బాల్ క్రికెట్‌లో 2025లో భారత్ ఆధిపత్యం చలాయించింది. ఛాంపియన్స్ ట్రోఫీ విజయంతో పాటు, టీ20లో నెంబర్ 1 జట్టుగా భారత్ నిలిచింది. నూతన సంవత్సర ఆరంభంలోనే న్యూజిలాండ్‌తో భారత్ వన్డేలు, టీ20 సిరీస్‌లను ఆడనుంది. ఈ పర్యటనలో మొత్తం 3 వన్డేలు, 5 టీ20లు జరుగుతాయి. భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యమిస్తున్న టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరుగుతుంది. గ్రూప్-ఏలో ఉన్న భారత్ తన లీగ్ మ్యాచ్‌లను కింది తేదీల్లో ఆడనుంది. వచ్చే ఏడాది టీమ్?ఇండియా దాదాపు 5 టెస్టులు, 18 వన్డేలు, 20 పైగా టీ20లు (ఆసియా క్రీడలు, వరల్డ్ కప్‌తో కలిపి) ఆడనుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో ఆడనున్నారు. వీరిద్దరు టీ20, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించినందున వన్డేల్లోనే ఆడతారు. కాబట్టి 2026లో ఈ ఇద్దరు లెజెండ్స్ 12 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో మైదానంలో అడుగుపెట్టనున్నారు. అయితే 2026లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు రోహిత్ శర్మ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. 2026వ సంవత్సరంలో భారత మహిళల క్రికెట్ జట్టు ఫుల్ బిజీగా ఉండనుంది. భారత మహిళల జట్టు ఫిబ్రవరిలో ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. ఈ పర్యటనలో అన్ని ఫార్మాట్లలో మ్యాచ్‌లు జరుగుతాయి. టీ20 ప్రపంచకప్ ముగిసిన వెంటనే, భారత్, ఇంగ్లాండ్ మహిళల జట్ల మధ్య లార్డ్స్ మైదానంలో తొలిసారిగా ఒక టెస్ట్ మ్యాచ్ జరగనుంది. జూలై 10న ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 జపాన్‌లోని ఐచి-నాగోయాలో జరిగే 20వ ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు పాల్గొంటుంది. గత ఎడిషన్‌లో గెలిచిన స్వర్ణ పతకాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా టీమ్‌ఇండియా బరిలోకి దిగుతుంది.

# టీ20 వరల్డ్ కప్ సాధించడమే మా అందరి లక్ష్యం : దీప్తిశర్మ

టీమ్‌ఇండియా వన్డే వరల్డ్‌కప్ 2025ను కైవసం చేసుకుని, తొలిసారిగా విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. అలాగే.. టీ20 వరల్డ్ కప్ 2026 జూన్, జులైలో జరగనుంది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా బౌలర్ దీప్తి శర్మ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. పొట్టి ప్రపంచకప్‌నకు ఇంకా చాలా సమయం ఉందని, ఇప్పుడే దాని గురించి ఆలోచించలేమన్నారు. అయితే టీ20 వరల్డ్ కప్ సాధించడమే తమ అందరి లక్ష్యమన్నారు. 'నేను ఎప్పుడూ జట్టు విజయం కోసం అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. 5-0 తేడాతో టీమ్‌ఇండియా సిరీస్ గెలవడంలో టీమ్‌లోని ఆటగాళ్ల అందరి పాత్ర ఉంది. ఇది సమష్టిగానే సాధ్యమైంది. వన్డే వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత అదే ఉత్సాహంతో టీ20 సిరీస్ గెలవడం ఆనందంగా ఉంది' అని దీప్తి శర్మ పేర్కొన్నారు.

'టీ20 వరల్డ్ కప్‌నకు చాలా సమయం ఉంది. ఇప్పుడే దాని గురించి ఆలోచించలేదు. అయితే మా అందరి అంతిమ లక్ష్యం మాత్రం వరల్డ్ కప్ సాధించడమే. దీన్ని మేం మ్యాచ్ నుంచి మ్యాచ్‌కు, సిరీస్ నుంచి సిరీస్‌కు కొనసాగిస్తున్నాం. మాకు వేర్వేరు మ్యాచ్ విన్నర్లున్నారు. అది జట్టుకు ఎంతో మంచిది' అని దీప్తి శర్మ వెల్లడించారు. తిరువనంతపురం వేదికగా భారత మహిళల జట్టు, శ్రీలంక మంగళవారం చివరి టీ20లో తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. అలాగే 5-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. వన్డే వరల్డ్ కప్ విజయం అనంతరం జరిగిన టీ20 సిరీస్‌లోనూ టీమ్‌ఇండియా సత్తా చాటింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమ్‌ఇండియా మొదట




తడబడింది. ఓపెనర్ షెఫాలీ వర్మ(5) త్వరగానే పెవిలియన్‌కు చేరి నిరాశపరిచింది. మరో ఓపెనర్ కమలిని (12) కూడా బ్యాటింగ్లో విఫలమైంది. రిచాఘోష్ (5), దీప్తి శర్మ (7), అమన్‌జోత్ కౌర్ పెద్దగా స్కోర్లు చేయలేకపోయారు. ఒకానొక దశలో టీమ్‌ఇండియా కేవలం 77 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే హర్మన్ ప్రీత్ కౌర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో (68, 43 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) ఆదుకుంది. దీంతో టీమ్‌ఇండియా నిర్ణీత 20 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి 175 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 7 వికెట్లు కోల్పోయి 160 పరుగులు మాత్రమే చేయగలిగిన విషయం తెలిసిందే.

# సర్ఫరాజ్ ఖాన్ సూపర్ సెంచరీ
## 444 పరుగుల భారీ స్కోర్ సాధించిన ముంబయి

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా జైపూర్ వేదికగా ముంబయి, గోవా తలపడుతున్నాయి. టాస్ గెలిచిన గోవా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో ముంబయి మొదట బ్యాటింగ్ ప్రారంభించింది. నిర్ణీత 50 ఓవర్లలో ముంబయి 8 వికెట్ల నష్టానికి 444 పరుగుల భారీ స్కోర్ సాధించింది. సరారేజ్ ఖాన్ సూపర్ సెంచరీతో సత్తా చాటాడు. కేవలం 56 బంతుల్లోనే 7 ఫోర్లు, 8 సిక్స్‌ల సాయంతో శతకం సాధిం చాడు. చివరికి 157 (75 బంతుల్లో, 9 ఫోర్లు, 14 సిక్స్‌లు) పరుగులకు పెవిలియన్‌కు చేరాడు. బీసీసీఐ సెలక్టర్లపై ఒత్తిడి పెంచే ఇన్నింగ్స్ ఆడాడు. టీమ్‌ఇండియా యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (46, 64 బంతుల్లో, 6 ఫోర్లు) ఫర్వాలేద నిపించాడు. సర్ఫరాజ్ ఖాన్ సోదరుడు ముషీర్ ఖాన్ (60, 66 బంతుల్లో, 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. వికెట్ కీపర్ హార్దిక్ తమోర్ (53, 28 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) తుపాన్ ఇన్నింగ్స్ ఆడాడు. అంగ్రిష్ రఘువంశీ (11), సిద్దేశ్ లాడ్ (17), కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ (27), షామ్స్ ములానీ (22) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. తనుష్ కొటియన్ (23), తుషార్ దేశ్‌పాండే (7) నాటౌట్‌గా నిలిచారు. గోవా బౌలర్లలో దర్శన్ 3, లలిత్ యాదవ్, వాసుకి కౌశిక్ తలో రెండు, దీపరాజ్ ఒక వికెట్ తీసుకున్నారు.



# వాట్సప్‌లో 'కొత్త' ఫీచర్లు..
## 2026 స్టిక్కర్స్, వీడియో కాల్‌లో ఎఫెక్ట్స్

కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న వేళ వాట్సప్ పలు కొత్త ఫీచర్లు తీసుకొచ్చింది. స్నేహితులు, కుటుంబ సభ్యులతో నూతన సంవత్సర వేడుకలను మరింత ఆనందంగా జరుపుకొనేందుకు వీటిని తెస్తున్నట్లు తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. 2026 స్టిక్కర్ ప్యాక్‌తో పాటు వీడియో కాల్స్‌లో ఎఫెక్ట్స్ వంటి ఫీచర్లను తెస్తున్నట్లు తెలిపింది. సాధారణ రోజుల్లో తమ వేదిక ద్వారా 100 బిలియన్ సందేశాలు, 2 బిలియన్ కాల్స్ జరుగుతాయని వాట్సప్ పేర్కొంది. న్యూఇయర్ రోజు మాత్రం ఈ విషయంలో ఏటా సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయని, ఈసారి కూడా సరికొత్త రికార్డులు నమోదు కావొచ్చని అంచనా వేస్తోంది. ఈ క్రమంలోనే కొత్త ఫీచర్లను జోడిస్తున్నామని, ఆ రోజంతా ఈ ఫీచర్లు అందుబాటులో ఉంటాయని వాట్సప్ పేర్కొంది.

### కొత్త ఫీచర్లు ఇవే..

- కొత్త ఏడాది సందర్భంగా వాట్సప్‌లో 2026 స్టిక్కర్ ప్యాక్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. మీ బంధువులు, స్నేహితులకు న్యూఇయర్ గ్రీటింగ్స్ చెప్పేందుకు ఈ స్టిక్కర్లు ఉపయోగపడతాయి. వీటిని వ్యక్తిగత, గ్రూప్ చాట్‌లలో వినియోగించొచ్చు.
- వీడియో కాల్‌లో కొత్త ఎఫెక్ట్‌లను వాట్సప్ తీసుకొస్తోంది. కొత్త ఏడాదిలో వీడియో కాల్ సమయంలో ఆన్ స్క్రీన్‌పై ఫైర్‌వర్క్స్, కన్ఫెట్టి (రంగుల కాగితం ముక్కలు), స్టార్స్




వంటి ఎఫెక్ట్స్‌ను జోడించొచ్చు.
- ఏదైనా సందేశానికి కన్ఫెట్టి ఎమోజీ జోడించినప్పుడు ఒక ప్రత్యేక యానిమేషన్ దర్శనమిస్తుంది.
- స్టేటస్ విభాగంలోనూ తొలిసారి యానిమేటెడ్ స్టిక్కర్లను జోడిస్తున్నట్లు వాట్సప్ తెలిపింది. కాంటాక్టులో ఉన్న వ్యక్తులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసేలా ఈ స్టిక్కర్లను వినియోగించొచ్చని పేర్కొంది.
- నూతన సంవత్సరం వేడుకల వేళ ఈవెంట్లను మరింత పకడ్బందీగా ప్లాన్ చేసుకోవడానికి ఈవెంట్ ప్లాన్, పోల్స్, లైవ్ లొకేషన్, వాయిస్/ వీడియో నోట్స్‌ను ఉపయోగించుకోవాలని యూజర్లకు సూచించింది.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



# స్టేజ్‌పై కన్నీరు.. ప్రభాస్ ఏమన్నారంటే

## మారుతి పంచుకున్న విశేషాలు

డెస్క్: ఇటీవల జరిగిన 'ది రాజాసాబ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో దర్శకుడు మారుతి భావోద్వేగానికి గురైన విషయం తెలిసిందే. ప్రభాస్ గురించి చెబుతూ.. 'మీరు ఎదురుగా ఉంటే నా వల్ల కాదు..' అంటూ ఆయన భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్నారు. వెంటనే ప్రభాస్ వేదిక పైకి వచ్చి మారుతిని ఓదార్చారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల వేదికగా వైరలైంది. తాజాగా మారుతి ఓ ఇంటర్వ్యూలో దాని గురించి మాట్లాడారు. "నేను ఆ సమయంలో ప్రభాస్ వేదిక పైకి వస్తారని అనుకోలేదు. నేను ఎమోషనల్ కాగానే ఆయన స్టేజ్ పైకి వచ్చి వెనకనుంచి హగ్ చేసుకున్నారు. వెంటనే 'సారీ డార్లింగ్' అని చెప్పా. 'ఫర్వాలేదు. ఈ కన్నీరు హృదయంలో నుంచి వచ్చేవి. నువ్వు ఎమోషనల్ అవుతావని ముందే ఊహించాను. నేను స్టేజ్ పైకి ఆలస్యంగా వచ్చాను. ముందే రావాల్సింది' అని ప్రభాస్ అన్నారు. ఎంత కంట్రోల్ చేసుకున్నా ఎమోషన్ ఆగలేదు" అని మారుతి తెలిపారు. " ది రాజాసాబ్' కథను చెప్పడానికి ప్రభాస్ దగ్గరకు వెళ్లినప్పుడు ఆయన 'ఆదిపురుష్' సెట్‌లో రాముడి గెటప్‌లో ఉన్నారు. వినోదాత్మక కథ ఉంటే చెప్పమన్నారు. హారర్ కామెడీ కథ ఉందని చెప్పా. ఆయన వెంటనే ఓకే అన్నారు. ఆయన ఓకే చెప్పిన తర్వాత నేను స్టోరీలో మార్పులు చేసి ఫాంటసీ ఎలిమెంట్స్ యాడ్ చేశాను. ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్ మీద హారర్ ఫాంటసీ కామెడీ సినిమా రాలేదు. ఇదే మొదటి చిత్రం అవుతుంది. కథ రాయడానికి సంవత్సరం పట్టింది. ఏడాదిన్నర పాటు మేకింగ్.. పోస్ట్‌ప్రొడక్షన్‌కు కూడా 7 నెలలు పట్టింది. మొత్తం సినిమా నాలుగు గంటలకు పైగా వచ్చింది" అని మారుతి తెలిపారు.



# మెగాస్టార్‌తో పోటీ..

## నవీన్ పొలిశెట్టి ఏమన్నారంటే

సినిమాల్లోనే కాదు వాటి ప్రచారంలోనూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే నటుల్లో నవీన్ పొలిశెట్టి ముందుంటారు. ఆయన హీరోగా దర్శకుడు మారి తెరకెక్కించిన చిత్రం 'అనగనగా ఒక రాజు'. జనవరి 14న విడుదల కానుంది. మీనాక్షి చౌదరి కథానాయిక. దీని ప్రచారంలో భాగంగా 'అనగనగా ఒక రాజు పెళ్లి రిసెప్షన్' పేరుతో ఈవెంట్ నిర్వహించారు. అందులో నవీన్ పొలిశెట్టి సందడి చేశారు. మీడియా అడిగిన ప్రశ్నలకు సరదాగా సమాధానమిచ్చారు.

**మీ పెళ్లి మీద చాలా వార్తలు వస్తున్నాయి? వాటిని ఎప్పుడు నిజం చేస్తారు?**

**నవీన్:** ప్రభాస్ ఏరోజు పెళ్లి చేసుకుంటారో.. ఆ మరుసటి రోజు మధ్యాహ్నం 12కు నేను చేసుకుంటా.

**సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవితో పోటీకి వస్తున్నారు. భయం వేయడం లేదా?**

**నవీన్:** మనం సామన్య కుటుంబంలో పుట్టినా కూడా స్టార్‌గా ఎదగవచ్చు అని చిరంజీవి ఎంతోమందికి స్ఫూర్తినిచ్చారు. ఈరోజు నాలాగా ఎంతోమంది ఇండస్ట్రీకి వచ్చి హీరో గా గుర్తింపు తెచ్చుకున్నారంటే దానికి కారణం మెగాస్టార్. ఆడియన్స్ అందరూ ఆయన నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చూసి మా చిత్రానికి వస్తారని అనుకుంటున్నా. నేను ఆయనకు వీరాభిమానిని.

**మీరు పెళ్లి చేసుకునే అమ్మాయికి ఎలాంటి లక్షణాలు ఉండాలి?**

**నవీన్:** ఆ అమ్మాయికి ఉండాల్సిన మొదటి లక్షణం నన్ను ప్రశ్నలు అడగకూడదు. తను ఎలా ఉన్నా నేను మారతాను ఆ అమ్మాయి కోసం.

**పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు?**

**నవీన్:** నాకు సినిమాల్లోనే పెళ్లి చేసుకోవాలని రాసి ఉన్నట్లుంది. మీరు ఇలానే ఆదరిస్తూ ఉంటే ప్రతి సినిమాలోనూ పెళ్లి సీన్ ఉండేలా చూస్తాను.

**మీనాక్షి చౌదరి: సమయం వచ్చినప్పుడు చేసుకుంటాను.**

**నవీన్‌తో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

**మీనాక్షి చౌదరి:** చాలా చలాకీగా ఉంటారు. ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. చాలా సపోర్ట్ చేస్తారు.

**బ్లాక్‌లో ఎక్కువ డబ్బులు పెట్టి చూసిన సినిమా ఏది?**

**నవీన్:** బాహుబలి. దానికి టికెట్స్ దొరకలేదు. బ్లాక్‌లో కొని వెళ్లాను.

**ఈ సినిమా కోసం త్రివిక్రమ్ ఏమైనా సలహాలు ఇచ్చారా?**

**నవీన్:** షూటింగ్ పూర్తయ్యాక ఆయనకు చూపించాం. కొన్ని సలహాలు ఇచ్చారు. అవి సినిమాకు ప్లస్ అయ్యాయి. మేం ఏ సన్నివేశాన్ని రీషూట్ చేయలేదు..

## అక్కడ మాత్రం 'ధురంధం'కు రూ.90 కోట్లు నష్టం



ఈ ఏడాది చివర్లో బాలీవుడ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది 'ధురంధర్'. మామూలు అంచనాలతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలై భారీ వసూళ్లు సొంతం చేసుకుంది. అయితే ఒక్క ప్రాంతంలో మాత్రం ఈ సినిమా నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. డిసెంబర్ 5న భారత్‌తో సహా.. యూరప్, ఉత్తర అమెరికా దేశాల్లో ఈ చిత్రం విడుదలైంది. కానీ, పశ్చిమాసియాలో మాత్రం దీనిపై నిషేధం విధించారు. గల్ఫ్ మార్కెట్‌లో ఈ చిత్రం విడుదల కాకపోవడంతో నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. దాదాపు రూ.90కోట్లు నష్టం వాటిల్లినట్లు విదేశీ పంపిణీదారు ప్రణబ్ కపాడియా తెలిపారు. "యాక్షన్ చిత్రాలు గల్ఫ్ దేశాల్లో మంచి ఆదరణను సొంతం చేసుకుంటాయి. ఈ సినిమాను కూడా అక్కడి ప్రజలు ఆదరిస్తారని విడుదల చేయాలనుకున్నాం. కానీ, మా ప్రయత్నాలు ఫలించలేదు. అక్కడ విడుదల కాకపోవడంతో సుమారు రూ.90 కోట్లు నష్టపోయాం. ఈ విషయంలో ఏమీ మాట్లాడలేం. అందరి మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత మాపై ఉంటుంది" అని ప్రణబ్ కపాడియా చెప్పారు. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియాతో పాటు యూఏఈ లోనూ ఈ సినిమా విడుదల కాని విషయం తెలిసిందే. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా తెరకెక్కించడం వల్లే ఆయా దేశాలు దీన్ని బ్యాన్ చేసినట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. గల్ఫ్‌లో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ ఈ సినిమా ఇక్కడ మాత్రం కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఇప్పటివరకూ రూ.1,100 కోట్లు వసూలు చేసింది

## ఒక్క ప్రాజెక్ట్ ఇండస్ట్రీలో నిలబెట్టింది : శ్రద్ధాదాస్

**టాలీవుడ్ నటి శ్రద్ధాదాస్ నటిగా, ఐటమ్ గర్ల్‌గా ప్రేక్షకులను మెప్పించింది. ఒకప్పుడు స్టార్ హీరోలతో నటించిన ఈ భామకు ప్రస్తుతం అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో అడపా దడపా చిత్రాల్లో నటిస్తూ.. ఇండస్ట్రీలో రాణిస్తోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె తన సినీ ప్రయాణం గురించి భావోద్వేగంగా మాట్లాడింది. నేను హైదరాబాద్ నుంచి విమానాశ్రయానికి కూడా చేరుకోకముందే 'ఆర్య 2' సినిమా నుంచి కాల్ వచ్చింది. ఆ ఒక్క ఫోన్ కాల్ తన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. అల్లు అర్జున్ సరసన నటించే అవకాశం రావడంతో నా కెరీర్ ఒక్కసారిగా కొత్త మలుపు తిరిగింది. 'ఆర్య 2' తర్వాత నాకు వరుసగా అవకాశాలు వచ్చాయి.. అలా ఏకంగా 13 సినిమాల్లో నటించే అవకాశం లభించింది. కానీ ఆ ఒక్క ప్రాజెక్ట్ నా జీవిత దిశను మార్చి, నన్ను ఇండస్ట్రీలో నిలబెట్టింది. అల్లు అర్జున్‌తో కలిసి పని చేయడం నాకు గొప్ప గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నా. ఆయనతో పనిచేసిన అనుభవం ఎంతో ప్రేరణనిచ్చింది.. నటిగా ఎదగడంలో కీలక పాత్ర పోషించింది. ఒక చిన్న కల ఎలా పెద్ద అవకాశాలకు దారి తీస్తుందో నా జీవితమే ఉదాహరణ" అంటూ భావోద్వేగానికి గురైంది. ఇక ఈ విషయంపై నెటిజన్లు రకరకాల కామెంట్లు పెడుతున్నారు.**



## ఓటీటీలోనూ సత్తాచాటిన రాజు వెడ్స్ రాంబాయి

మంచి సినిమాకు వేదిక ఏదైనా ప్రేక్షకుల ఆదరిస్తారని ప్రూవ్ చేస్తోంది కల్ట్ రూరల్ బ్లాక్ బస్టర్ మూవీ "రాజు వెడ్స్ రాంబాయి". ఈ సినిమా థియేట్రికల్ గా రూ. 20 కోట్ల కలెక్షన్స్ సాధించి కంటెంట్ ఉన్న చిన్న సినిమా పొటెన్షియాలిటీ చూపించింది. మరోవైపు ఓటీటీలోనూ సత్తాచాటింది. ఈటీవీ విన్ స్ట్రీమింగ్ అవుతున్న "రాజు వెడ్స్ రాంబాయి" మూవీ 100 ప్లస్ మిలియన్ మినిట్స్ వ్యూయర్ షిప్ దక్కించుకోవడం విశేషం. హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ అంటూ ప్రేక్షకులు, క్రిటిక్స్ ప్రశంసలు అందుకుందీ సినిమా. "రాజు వెడ్స్ రాంబాయి" చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్ పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చారు.






## 'టాక్సిక్'లో నయనతార..

### ఆకట్టుకుంటోన్న లుక్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో నయనతార లుక్‌ను టీమ్ రిలీజ్ చేసింది. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకొని పవర్‌ఫుల్ లుక్స్‌తో నయన్ కనిపించారు. ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్‌లు ఉన్నట్లు మొదటినుంచి వార్తలు వస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ చిత్రబృందం ముగ్గురు హీరోయిన్ల లుక్‌లను వరుసగా విడుదల చేసింది. కియారా ఆడ్వాణీ నదియా పాత్రలో కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన 19వ చిత్రంగా 'టాక్సిక్' తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీయఫ్' తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com